

సమావేశ ప్రాంగణానికి వచ్చే దారిలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ పెంపు

నేటి నుంచి అమలు

- కనిష్ఠంగా 23 శాతం, గరిష్ఠంగా 34 శాతం..
- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిట!
- మొరాయించిన సర్వర్లు
- మందకొడిగా సాగిన రిజిస్ట్రేషన్లు



ఆస్తుల క్రయవిక్రయదారులతో రద్దీగా ఉన్న మాడుగుల సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

అనకాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

జిల్లాలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువ శనివారం నుంచి పెరగనున్నది. ప్రాంతాలనుబట్టి కనిష్ఠంగా 23 శాతం, గరిష్ఠంగా 34 శాతం మేర ఆస్తుల విలువ పెరుగుతుంది. ఇది ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అమల్లోకి వస్తున్నది. చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో అత్యధికంగా 132 గ్రామాల్లో స్థిరాస్తి విలువ పెరగనుంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్థిరాస్తుల క్రయ విక్రయాల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లా అధికారులు ఆస్తుల విలువను సవరించారు. దీనివల్ల జిల్లాలో రిజిస్ట్రేషన్‌ల ఆదాయం రూ.50 కోట్ల నుంచి రూ.60 కోట్ల వరకు పెరుగుతుందని ఆ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రద్దీ

స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ విలువను ప్రభుత్వం ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి పెంచనుండడంతో కొత్తగా ఆస్తులను కొనుగోలు చేసేవారు గురు, శుక్రవారాల్లో రిజిస్ట్రేషన్లకు ముహూర్తం పెట్టుకున్నారు. దీంతో జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు ఆస్తుల క్రయ విక్రయ దారులతో కిటకిటలాడాయి. సాధారణ రోజులతోపోలిస్తే రెట్టింపు సంఖ్యలో రిజిస్ట్రేషన్లు జరిగినట్టు తెలిసింది. జిల్లాలోని 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గురువారం 404 డాక్యుమెంట్లు, శుక్రవారం 620 డాక్యుమెంట్లు ... మిగతా 6వ పేజీలో

జిల్లాలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా శనివారం నుంచి పెరగనున్న ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ (శాతం)

కార్యాలయం	గ్రామాలు	పెంపు శాతం
అనకాపల్లి	75	24
చోడవరం	132	25
కె.కోటపాడు	62	32
కోటవురట్ల	77	23
లంకెలపాలెం	32	27
మాడుగుల	65	34
నక్కపల్లి	66	34
నర్సీపట్నం	87	25
సబ్బవరం	49	32
ఎలమంచిలి	84	31

మాడుగులలో రద్దీ

- సర్వర్ మొరాయించడంతో తీవ్రజాప్యం
- ఆస్తుల క్రయవిక్రయదారులు పడిగాపులు

మాడుగుల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):



కార్యాలయం బయట నిరీక్షిస్తున్న ఆస్తుల క్రయవిక్రయదారులు

మాడుగుల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శుక్రవారం సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మందకొడిగా సాగింది. ఈ ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువను ప్రభుత్వం పెంచనుండడంతో ఆస్తులు కొనుగోలు చేసిన వారు శుక్రవారం రిజిస్ట్రేషన్లు పెట్టుకున్నారు. దీంతో ఆస్తుల అమ్మకందారులు, కొనుగోలుదారులు, సాక్షి సంతకాలు చేయడానికి వచ్చిన వారిలో కార్యాలయం కిటకిటలాడింది. కార్యాలయం లోపల ఇరుకుగా వుండడంతో చాలా మంది బయట వేచివుండాల్సి వచ్చింది. దీనికితోడు సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ నెమ్మదిగా సాగింది. దూర ప్రాంతాల నుంచి వచ్చిన మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు 15 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ అయ్యాయని, మరో 15 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేయాల్సి వుందని సిబ్బంది చెప్పారు.



గొట్టివాడ వద్ద వరహా నదిలో ఇసుక తవ్వకాలు

ఇసుక తవ్వకాలకు వేలం పాట

- టీడీపీ, వైసీపీ నాయకులు కుమ్మక్కు
- గొట్టివాడలో మూడు నెలలకు రూ.17 లక్షలకు పాడుకున్న ఓ మహిళ
- ఇసుక రవాణాకు దారి నిర్మాణం
- పనులను అడ్డుకున్న తహసీల్దార్, ఎక్స్‌కవేటర్ సీజ్

కోటవురట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని గొట్టివాడలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నేతలు కుమ్మక్కయ్యారు. గ్రామ పరిధిలో వరహా నదిలో ఇసుక తవ్వకాలకు వేలంపాట నిర్వహించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు నదిలో ఇసుక తవ్వుకుని, అమ్ముకోవడానికి 19 లక్షల రూపాయలకు ఓ మహిళ పాడుకున్నట్టు తెలిసింది.

కోటవురట్ల మండలం మీదగా వరహా, సర్పా నదులు ప్రవహిస్తున్నాయి. సర్పా నదితో పోలిస్తే వరహా నదిలో ఇసుక నిల్వలు అధికంగా వుంటాయి. దీంతో నదికి ఇరువైపులా వున్న గ్రామాలకు చెందిన ప్రధాన రాజకీయ పార్టీల నేతల అండదండలతో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా సాగుతుంటాయి. గ్రామ అభివృద్ధి లేదా గ్రామ దేవత ఉత్సవాల ఖర్చుల పేరిట ఇసుక తవ్వకాలకు వేలం పాట నిర్వహిస్తుంటారు. ఈ నేపథ్యంలో స్థానిక అవసరాల నిమిత్తం సచివాలయాల్లో అనుమతులు తీసుకుని నదుల్లో ... మిగతా 6వ పేజీలో

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైసీపీ

నియమావళికి విరుద్ధంగా పార్లమెంటరీ స్థాయి సమావేశం

- అధికారులు అభ్యంతరం చెప్పినా బేఖాతరు
- రెండు గంటలపాటు సాగిన సమావేశం
- దారికి ఇరువైపులా పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు

కశింకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):



వైసీపీ నేతలతో మాట్లాడడానికి వచ్చిన అధికారులు (కుడివైపున వృత్తంలో..)

అధికారంలో వున్నప్పుడు వైసీపీ నాయకులు ఎంత అడ్డగోలుగా వ్యవహరించారో.. అధికారాన్ని కోల్పోయిన తరువాత కూడా అదే తరహాలో వ్యవహరిస్తున్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలను ఉల్లంఘించి పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో వున్నందున అనుమతి లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించకూడదని అధికారులు చెప్పినా పట్టించుకోలేదు. సుమారు రెండు గంటలపాటు సమావేశాన్ని కొనసాగించారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి.

వైసీపీ అనకాపల్లి పార్లమెంటరీ నియోజకవర్గం స్థాయి సమావేశాన్ని శుక్రవారం కశింకోటలోని ఒక ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశారు. దీనికి సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, నియోజకవర్గం ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి అమర్, మాజీ ఎమ్మెల్యే, ఇతర నాయకులు హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో కార్యకర్తలు వచ్చారు. ప్రధాన రహదారి నుంచి సమావేశం జరిగే ఫంక్షన్ హాలు వరకు అడుగడుగునా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఇంతవరకు బాగానే వున్నప్పటికీ ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు బుధవారం నోటిఫికేషన్ వెలువడింది. ఆ క్షణం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలు, నాయకుల ఫ్లెక్సీలు వుండకూడదని, నేతల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతులు తప్పనిసరి. అయితే వైసీపీ నాయకులు ఎటువంటి అనుమతులు లేకుండా పార్లమెంటరీ స్థాయి సమావేశాన్ని నిర్వహించి ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఉల్లంఘించారు. వైసీపీ సమావేశం గురించి తెలుసుకున్న తహసీల్దారు ఎ.శ్రీనివాసరావు, ఎంపీడీవో రవికుమార్, సీఐ అల్లు స్వామినాయుడు, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు అక్కడకు వెళ్లి... అనుమతి లేకుండా సమావేశం నిర్వహించకూడదని చెప్పారు. కానీ వైసీపీ నాయకులు వారితో వాగ్వాదానికి దిగారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు తమకు కూడా తెలుసుని, సమావేశాలు నిర్వహించుకోవచ్చని చెప్పారు. అధికారులు ఎంత సర్దిచెప్పినప్పటికీ వైసీపీ నేతలు వినలేదు. దీంతో అధికారులు అక్కడి నుంచి వెనుతిరిగారు. తరువాత సుమారు రెండు గంటలపాటు సమావేశం జరిగింది.

పడుతూ.. లేస్తూ..

గోవాడ షుగర్స్‌లో గాడితప్పిన చెరకు క్రషింగ్

- తరచూ అంతరాయాలతో రైతులు అసహనం
- పది రోజుల్లో గానుగాడింది నాలుగు రోజులే!
- యార్డులో గంటల తరబడి చెరకు బండ్లతో రైతులు నిరీక్షణ
- యాజమాన్యం తీరుపై ఆగ్రహం





షుగర్ ఫ్యాక్టరీలో యార్డులో చెరకుతో వేచివున్న ట్రాక్టర్లు, టైరు బండ్లు

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ పరిస్థితి ఒక అడుగు ముందుకు.. మూడు అడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. ఈసారి నెల రోజులకు పైబడి ఆలస్యంగా క్రషింగ్‌ను ప్రారంభించగా.. ఆది నుంచీ అంతరాయాలు ఎదురవుతున్నాయి. సాంకేతిక సమస్యల కారనంగా క్రషింగ్ ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చిన రైతులు గంటల తరబడి యార్డులో నిరీక్షించాల్సి వస్తున్నది. యార్డు నిండిపోయి మెయిన్‌రోడ్డు పక్కన కూడా చెరకు బండ్లు, ట్రాక్టర్లు బారులు తీరుతున్నాయి. రాత్రిపూట చలితీవ్రత, తెల్లవారుజామునుంచి దట్టంగా మంచు కురుస్తుండడంతో చెరకు బండ్ల వద్ద జాగారం చేస్తున్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో ఏటా నవంబరు చివరి వారం లేదా డిసెంబరు మొదటి వారంలో చెరకు క్రషింగ్ సీజన్ ప్రారంభం అవుతుంది. గత ఏడాది నవంబరుతోపాటు డిసెంబరు మొదటి వారంలో కూడా వర్షాలు కురవడంతో తోటల్లో చెరకు నరకడానికి వీలుకాని పరిస్థితి ఏర్పడింది. దీంతో డిసెంబరు 21న క్రషింగ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. కానీ పొలాలు పూర్తిగా ఆరకపోవడంతో రైతులు చెరకు నరికివేత పనులు మొదలుపెట్టలేదు. పొలాలు ఆరేసరికి సంక్రాంతి పండుగ రావడం, వేతనాల కోసం కార్మికులు ఆందోళనకు దిగడంతో చెరకు క్రషింగ్ మరింత జాప్యం అయ్యింది. ఎట్టకేలకు జనవరి 21న రెగ్యులర్ క్రషింగ్ ప్రారంభమైంది. ఐదు రోజులు గడిచిన తరువాత బాయిలర్‌కు సరిపడ చెరకు పిప్పి లేకపోవడంతో క్రషింగ్ ఆగిపోయింది. చెరకు పిప్పిని సమకూర్చుకుని రెండు రోజుల అనంతరం క్రషింగ్‌ను తిరిగి ప్రారంభించారు. మళ్లీ కొద్ది గంటలకే గత మంగళవారం ఉదయం మరోసారి క్రషింగ్ నిలిచిపోయింది. దీంతో ఫ్యాక్టరీకి చెరకు తీసుకువచ్చిన రైతులు ఎండీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫ్యాక్టరీ సిబ్బంది సమస్య చక్కదిద్ది బుధవారం క్రషింగ్‌ను పునరుద్ధరించారు. రెండు రోజులు గడిచే సరికి శుక్రవారం ఉదయం బగాస్ క్యారేజీ చెయిన్ తెగిపోవడంతో క్రషింగ్ నిలిచిపోయింది. సాయంత్రం వరకు క్రషింగ్‌ను పునరుద్ధరించలేదు. చెరకు క్రషింగ్ ఊపందుకోకపోగా తరచూ అంతరాయం కలుగుతుండడంతో యార్డులో చెరకు బండ్లు బారులు తీరాయి. ఈ స్థలం నిండిపోవడంతో మెయిన్ రోడ్డుపక్కన నిలుపుదల చేయాల్సి వస్తున్నది. పొలాల్లో చెరకు నరికిన మిగతా 6వ పేజీలో

ఉత్సాహంగా ఉత్సవ్

ఉదయం 5కే రన్

- సాయంత్రం కార్నివాల్
- ప్రధాన వేదికపై గిరిజన నృత్యాల ప్రదర్శన
- పద్మాపురం గార్డెన్స్‌లో పుష్ప ప్రదర్శన



తుడుము కొట్టి అరకు ఉత్సవ్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

అరకులోయ/అనంతగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్రా ఊటీ అరకులోయలో శుక్రవారం అరకు చలి ఉత్సవ్ అట్టహాసంగా మొదలైంది. జిల్లా కలెక్టర్ ఎ.ఎస్.దినేశ్‌కుమార్ తుడుము కొట్టి ఉత్సవ్‌ను లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు ఉదయం యండపల్లివలస నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకూ 5కే రన్‌ను నిర్వహించారు. స్థానిక గిరిజన మ్యూజియం ఆవరణలో ముగ్గులు, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. సాయంత్రం గిరిజన మ్యూజియం వద్ద నుంచి డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన ప్రధాన వేదిక వరకూ కార్నివాల్ నిర్వహించారు. కార్నివాల్‌లో వివిధ జాతులకు చెందిన గిరిజనులు తమ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు. మ్యూజియం ప్రాంగణం వద్ద జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్, జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ డ్యాన్స్ చేసి హుషారెత్తించారు. గిరిజన యువతీ, యువకులు, పర్యాటకులు నృత్యాలు చేస్తూ ఎంజాయ్ చేశారు. కార్నివాల్‌కు విశేష స్పందన లభించింది.



గిరిజనులతో కలిసి థింసా నృత్యం చేస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఐటీడీపీ పీవో అభిషేక్, జేసీ అభిషేక్ గౌడ

ఆకట్టుకున్న ప్రదర్శనలు

ప్రధాన వేదికపై శుక్రవారం సాయంత్రం ప్రదర్శించిన బస్తార్ బంద్, తోడా, గోండు ట్రైబ్స్ నృత్యం, తప్పెటగుళ్లు, కొమ్ముకోయ, సవర నృత్యం, జాతపు నృత్యం, చెక్క భజన, జముకుపేట, మణిపూర్ సంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

మరికొన్ని ఫొటోలు 6వ పేజీలో



గురువారం రాత్రి అధిష్ఠాన్ కంపెనీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళా ఉద్యోగులు

చలి, మంచును లెక్కచేయకుండా..

అధిష్ఠాన్ కంపెనీ ఎదుట మహిళా ఉద్యోగులు రాత్రంతా ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- మెయిన్ గేటు ఎదుట బైఠాయింపు
- చీకటి పడిన తరువాత కూడా కొనసాగింపు
- స్పందించిన అధికారులు... దిగొచ్చిన యాజమాన్యం
- సీఐటీయూ నాయకులతో చర్చలు
- పదో తేదీలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ

- 6లో

వేమగిరిలో గ్రావెల్ దందా

జిరాయితీ భూమి అభివృద్ధి మాటున అక్రమ రవాణా

- ప్రైవేటుగా గ్రావెల్ అమ్మకాలు
- పట్టించుకోని రెవెన్యూ సిబ్బంది



గ్రావెల్ తవ్వి, లారీల్లోకి లోడింగ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

ఎస్.రాయవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి):

ఎత్తుపల్లాలుగా వున్న జిరాయితీ భూమి లెవెలింగ్ అనుమతుల ముసుగులో గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణా జోరుగా సాగుతున్నాయి. భూమి చదును చేసే క్రమంలో వచ్చే మట్టి, గ్రావెల్‌ను ట్రాక్టర్లతో ఒక రోడ్డు నిర్మాణానికి మాత్రమే తరలించడానికి అధికారులు అనుమతులు ఇచ్చారు. కానీ సదరు వ్యక్తి గ్రావెల్‌ను ట్రాక్టర్లతోపాటు లారీల్లోకి సైతం లోడింగ్ చేస్తూ, ఇతర పనులకు అమ్ముకుంటున్నారు. భూమి చదును పేరుతో నిబంధనలు ఉల్లంఘిస్తున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టించుకోవడంలేదు.

మండలంలోని జంగులూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నేత ఒకరికి వేమగిరిలో వ్యవసాయానికి అనువుగా లేని జిరాయితీ భూమి వుంది. వ్యవసాయానికి అనువుగా అభివృద్ధి చేసుకోవడానికి ఈ భూమిని లెవెలింగ్ చేసుకోవడానికి, ఈ క్రమంలో అవసరం లేని గ్రావెల్‌ను పేటసూదిపురంలో రోడ్డు నిర్మాణానికి తరలించడానికి అనుమతి కోసం తహసీల్దారుకు ఇటీవల ... మిగతా 6వ పేజీలో



అధిక బరువుతో ఓవైపునకు ఒంగి మరీ రోడ్డుపై వెళుతున్న వ్యాన్

పరిమితికి మించి లోడు.. ప్రయాణంలో స్పీడు!

- నిబంధనలకు విరుద్ధంగా పలు వాహనాలు రాకపోకలు
- పట్టించుకునేవారు కరువు
- ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని అందరిలో టెన్షన్



మార్టూరు రోడ్డులో అధిక ఇసుక బరువుతో వస్తున్న వాహనం

అచ్యుతాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం అచ్యుతాపురం పరిసర ప్రాంతాల ప్రజలను పలు వాహనాలు భయపెడుతున్నాయి. పరిమితికి మించిన బరువులతో రాకపోకలు సాగిస్తుండడం వల్ల ఎప్పుడు ఎటువంటి ప్రమాదం జరుగుతుందోనని హడలిపోతున్నారు. ఇసుక లోడ్‌లతో వస్తున్న వాహనాల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. పలువురు ఇష్టారాజ్యంగా పరిమితికి మించి మరీ ఇసుకను లోడ్ చేస్తున్నారు. కనీస జాగ్రత్తలు తీసుకోవడం లేదు. అటువంటి వాహనాలు రోడ్లపై వెళ్లేటప్పుడు ఇసుక గాలికి ఎగిరి రోడ్డుపై ప్రయాణించే ఇతర వాహనదారుల కళ్లలో పడుతోంది. దీంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరికొందరు వాహనాలను స్పీడ్‌గా నడుతుండడం చిన్నచిన్న ప్రమాదాలకు కారణమవుతోంది. సెజ్‌లోని కర్మాగారాలకు ఏదో విధంగా సామగ్రిని చేర్చాలని కొందరు భావిస్తున్నారే తప్ప, సరుకును తీసుకు వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే ఇతరులకు ఎదురయ్యే సమస్యలను గుర్తించిలేకపోతున్నారు. పోలీసులు అధికారులు వెంటనే స్పందించి ఇటువంటి వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టడంతో పాటు డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతున్నారు.

ఎన్నికల కోడ్ ఉన్నా.. ఎక్కడికక్కడ ఫ్లెక్సీలే..!

ఎలమంచిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటికీ పట్టణంలోని పలుచోట్ల రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు దర్శనమిస్తున్నాయి. ప్రధాన జంక్షన్లు, మునిసిపల్ కార్యాలయం ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపం తదితర ప్రాంతాల్లో ఉన్నా వీటిని తొలగించేందుకు సంబంధిత అధికారులు స్పందించలేకపోతున్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే అప్రమత్తం కావాల్సిన అధికారులే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా అనే ప్రశ్నలు పలువురి నుంచి వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అచ్యుతాపురంలో ఎన్నికల కోడ్ పక్కాగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాల్సిందిగా అంతా కోరుతున్నారు.

రైల్వే గేటు.. పడితే పనులన్నీ లేటు

- పెదపల్లి, ఏటికొప్పాక పరిసర ప్రాంతాల ప్రజలకు నిత్యం అవస్థలు
- రైళ్లు వెళ్లే వేళలో గేట్ల వద్ద ఇబ్బందులు
- సకాలంలో విద్యాలయాలు, విధులు, వ్యాపారాలకు వెళ్లలేకపోతున్నామని పలువురు ఆవేదన
- గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ పాలకులు
- ఇటీవల ఎమ్మెల్యే 'సుందరపు' ప్రత్యేక చొరవతో అందరిలో ఆశలు



ఏటికొప్పాక వద్ద...



పెదపల్లి రైల్వే గేటు పడడంతో వేచి ఉన్న వాహనదారులు, పాదచారులు

ఎలమంచిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పెదపల్లి రైల్వే గేటు, మేజర్ పంచాయతీ ఏటికొప్పాక వద్ద గల రైల్వే గేటు ఆయా ప్రాంతాల ప్రజల సహనానికి పరీక్షగా మారాయి. దీర్ఘకాలంగా ఈ సమస్యలు వారిని వేధిస్తున్నా కన్నెత్తి చూసేవారు కరువయ్యారు. ఫలితంగా నిత్యం ప్రయాణాలు ఆలస్యంగా సాగుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారంతా వాపోతున్నారు. పెదపల్లి రైల్వే గేటు మీదుగా రామ్‌నగర్, ఏఎస్ఆర్ కాలనీ, పెదపల్లి, గొల్లలపాలెం, మంత్రిపాలెం, చినగొల్లలపాలెం వార్డులకు చెందిన వేలాది మంది ప్రజలు ఎలమంచిలికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. ఇక్కడ రైళ్లు వచ్చిపోయే వేళల్లో తరచూ గేటు పడుతుండడంతో ప్రత్యక్ష నరకాన్ని చూస్తున్నామని అంతా చెపుతున్నారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో విధులకు వెళ్లే ఉద్యోగులు, కార్మికులు సకాలంలో హాజరు కాలేకపోతున్నామని అంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలంటూ పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా పరిష్కారం మాత్రం కానరావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ సమస్యపై దృష్టి సారించేవారు కరువయ్యారని అంటున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కూటమి అధికారంలోకి రావడంతో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ప్రత్యేక చొరవ చూపి పెదపల్లి రైల్వే గేటు వద్ద ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రత్యామ్నాయంగా చర్యలు తీసుకునేందుకు రైల్వే అధికారులతో కలిసి పరిశీలించారు. అలాగే, ఏటికొప్పాక రైల్వే గేటు వద్ద కూడా చర్యలు చేపట్టేందుకు ఉపక్రమించారు. ఈ రెండు చోట్ల ప్రత్యామ్నా చర్యలు త్వరితగతిన జరిగేలా ఎమ్మెల్యే ప్రత్యేక దృష్టి సారించాలని అంతా కోరుతున్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : డీఈవో



టెన్త్ విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తున్న డీఈవో అప్పారావునాయుడు

మునగపాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో శతశాతం ఫలితాలు సాధించడమే లక్ష్యంగా అంతా పనిచేయాలని జిల్లా విద్యాశాఖాధికారి జి.అప్పారావునాయుడు సూచించారు. మండలంలోని తోటాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ దిశానిర్దేశం చేశారు. పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలి, ఎలా రాయాలి తదితర అంశాలను వివరించారు. ఏకాగ్రతతో చదవడం వలన మంచి ఫలితాలు సాధించవచ్చునని చెప్పారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూశారు. పాఠశాల పరిసరాలను చూసి నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో వేణుగోపాలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఉన్నారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎలమంచిలి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో శుక్రవారం రాత్రి ఆత్మార్పణ దినోత్సవాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపారాధన చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కన్యకాపరమేశ్వరీ అమ్మవారు



అమ్మవారి ఆలయంలో మహిళల దీపారాధన

నేడు మునగపాకలో గౌరీపరమేశ్వరుల వేడుక



మునగపాక, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : గౌరీపరమేశ్వరుల ఉత్సవం మునగపాకలో శనివారం అత్యంత ఘనంగా జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఆలయంతో పాటు గ్రామం లోని ప్రధాన వీధుల్లో విద్యుద్దీపాలంకరణ పనులు చేపట్టారు. సాంస్కృతిక ప్రదర్శనలకు అనువుగా భారీ స్టేజ్‌లను సిద్ధం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించారు. తెల్లవారుజాము నుంచి పూజలు ప్రారంభం కానున్నాయి. సాయంత్రం ఆరు గంటలకు ఉత్సవ విగ్రహం ఊరేగింపు మేళతాళాలు, బాజాభజంత్రీల నడుమ ప్రారంభం కానుందని కమిటీ సభ్యులు పెంటకోట ఆదినారాయణ, ఆడారి అప్పలనాయుడు, పొలిమేర గణేశ్ తదితరులు తెలిపారు. ఇదిలావుంటే, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర శుక్రవారం గౌరీపరమేశ్వరులను దర్శించుకున్నారు. ఆయనకు కమిటీ సభ్యులతో పాటు కూటమి నాయకులు బొడ్డేడ అప్పలనాయుడు, అతని మిత్ర బృందం సత్కరించి వేంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని బహూకరించారు.



విద్యుద్దీపాలంకరణలో ఆది దంపతుల ఆలయం

డిప్యూటీ సీఎం పవన్ పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై ఫిర్యాదు



సీఐ గణేశ్‌కు ఫిర్యాదు కాపీ అందిస్తున్న జనసేన నాయకులు

అచ్యుతాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి తెలిపారు. మడుతూరు ఉప సర్పంచ్, వైసీపీ నాయకుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గౌరవమర్యాదలకు భంగం కలిగేలా అనునిత్యం వాట్సాప్ గ్రూపులతో పాటు ఫేస్‌బుక్‌లో మెసేజ్‌లు పోస్ట్ చేస్తున్నారని ఆమె ఆరోపించారు. ఈ మేరకు సీఐ నమ్మి గణేశ్‌కు శుక్రవారం సాయంత్రం ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. ఆమె వెంట నాయకులు కరెడ్ల సూర్యప్రకాశ్, నీరుకొండ సంతోష్ కుమార్, సింహాద్రి రవి ఉన్నారు.

ఉపమాక మాడవీధులకు మహర్దశ



మాఢవీధుల్లో సీసీ రోడ్ల నిర్మాణాలకు కొలతలు తీస్తున్న దృశ్యం

నక్కపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపమాక క్షేత్రంలో స్వామివారి ఉత్సవాలకు ఇబ్బంది లేకుండా మాడవీధుల్లో సీసీ రహదారుల నిర్మాణాలు చేపడుతున్నట్టు ఆలయ మాజీ చైర్మన్ కొప్పిశెట్టి బుజ్జి తెలిపారు. హెటిరో ఔషధ పరిశ్రమ యాజమాన్యం సుమారు రూ.25 లక్షల వ్యయంతో మాడవీధుల్లో 650 మీటర్ల సీసీ రహదారుల నిర్మాణానికి ముందుకొచ్చిందన్నారు. హోం మంత్రి అనిత సూచనల మేరకు మార్చి నెల మొదటి వారానికి పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. శుక్రవారం ఈ నిర్మాణాలకు అవసరమైన కొలతలను వేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వరహాలరావు, కనకరాజు, తోలేటి శ్రీను, వాసు, హెటిరో సీఎస్ఆర్ ప్రతినిధి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బైక్ తగలబెట్టుకున్న యువకుడు

నర్సీపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లికి చెందిన విజయ్ తన బైక్ తనే తగలబెట్టుకున్నాడు. శుక్రవారం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో విజయ్‌కి అతని స్నేహితుడుకి మధ్య చిన్న గొడవ జరిగింది. విజయ్ బైక్ తాళాలు అతని స్నేహితుడు పట్టుకుపోయాడు. ఆ కోపంలో తన బైక్‌కి తనే నిప్పు పెట్టాడు. స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపు చేశారు.

వీరవిల్లి అగ్రహారానికి జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీ అవార్డు



అవార్డు తీసుకుంటున్న సర్పంచ్ కామలక్ష్మి

మాడుగుల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి అందుకున్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అన్ని కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు 90 శాతం అమలు చేసిన వీరవిల్లి అగ్రహారం గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ కేంద్రానికి నివేదించింది. ఈ మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఈ పంచాయతీని జాతీయ స్థాయిలలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ కామలక్ష్మి మాట్లాడుతూ అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు. తాము చేసిన ప్రతీ పనిని డాక్యుమెంట్ రూపంలో ప్రభుత్వానికి అప్పటి పంచాయతీ కార్యదర్శి కెజగదీశ్ నివేదించారన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపార

3 నుంచి పాండురంగస్వామి కల్యాణ మహోత్సవాలు

పాయకరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రాధారుక్మిణి సహిత పాండురంగస్వామివారి కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని ఆలయ ఈవో కె.దివ్యతేజ తెలిపారు. ఫిబ్రవరి 9వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహిస్తామని చెప్పారు. ఆలయ ప్రధానర్చకులు యి.కృష్ణస్వామి, నారాయణాచార్యుల ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం మృత్యంగ్రహణం అంకురార్పణ, 4న నిత్య విశేషకార్యక్రమాలతో పాటు అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణ, సాయంత్రం



పాండురంగస్వామి, అమ్మవార్లు

స్వామివారి ఎదురు సన్నాహ మహోత్సవం, రాధారుక్మిణి సహిత పాండురంగస్వామి తిరు కల్యాణాన్ని నిర్వహించనున్నట్టు చెప్పారు. అలాగే 5న నిత్య విశేష కార్యక్రమాలు, 6న సదస్య మహోత్సవం, 7న దొంగల దోపు ఉత్సవం, 8న పూర్ణాహుతి, చక్రస్నానం, 9న పుష్పయాగం జరుగుతాయని ఈవో వివరించారు. ఈ కార్యక్రమాలను భక్తులు విజయవంతం చేయాలని కోరారు.

ఘనంగా కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినం

పాయకరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పాండురంగస్వామి ఆలయం నుంచి పట్టణంలోని మంగవరం రోడ్డులో ఉన్న రామాలయం వరకు ఆర్యవైశ్యులు ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో అమ్మవారి చిత్రపటాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఎదుట 102 దీపాలు వెలిగించి భక్తి గీతాలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వి.సత్యనారాయణ, ఎ.వాసు, కోశాధికారి దాసరి ప్రదీప్, వాసవీ వనితా క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రావణి, సుబ్బలక్ష్మి, వాసవి క్లబ్ పాయకరావుపేట జోన్ చైర్మన్ రాయపూడి జయప్రకాశ్, గ్రంధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో కన్యకాపరమేశ్వరి అమ్మవారికి పూజలు చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు



నక్కపల్లిలో నగర సంకీర్తన నిర్వహిస్తున్న భక్తులు, గ్రామస్థులు

నక్కపల్లిలో..

నక్కపల్లి: నక్కపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వాసవీమాతకు మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారి చిత్రపటంతో నగర సంకీర్తన నిర్వహించారు.

ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కక్కరాల సురేశ్, సెక్రటరీ కొత్త సందీప్, సభ్యులు నున్న గుప్త, మామిడి తాతాజీ విశ్వేశ్వరరావు, వాసు, భగవాన్, నర్సింహమూర్తి, గణేశ్, మన్యం, నున్న బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఉపమాక శివాలయంలో శ్యామలా నవరాత్రులు



అమ్మవారికి నక్షత్ర హారతులిస్తున్న దృశ్యం

నక్కపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక శివాలయంలో శ్యామలా నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం రాత్రి అమ్మవారికి అర్చకులు వెలవలపల్లి మహేశ్, సంతోశ్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సప్తహారతులిచ్చారు. ఈ నెల 7వ తేదీ వరక శ్యామలా నవరాత్రులు కొనసాగనున్నట్టు అర్చకుడు మహేశ్ తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి 'గాదె' ప్రచారం

కోటవురట్ల, జనవరి 31: ప్రభుత్వ ఉద్యోగులకు హెల్త్ కార్డుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించేలా చూస్తానని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ నియోజకవర్గ అభ్యర్థి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులనాయుడు అన్నారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్యాష్‌లెస్ వైద్యం అందేలా, పాఠశాలలో కంప్యూటర్ ఆపరేటర్లు, నైట్ వాచ్‌మెన్ పోస్టుల భర్తీచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్, నాయకులు ఆర్‌ప్రతాప్ కుమార్, అబ్దుల్లా, డేవిడ్ పాల్గొన్నారు.

హెచ్‌ఎం కుమార్‌స్వామి సేవలు భేష్

ఎస్.రాయవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెదఉప్పలం ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఇ.కుమార్‌స్వామిని శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కేకేఎల్ఎన్ మాట్లాడుతూ కుమార్‌స్వామి ఉద్యోగ జీవితంలో ఒక్క మెడికల్ లీవ్ కూడా వాడకుండా పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం సకురు సత్యనారాయణ, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంచే ముసుగేసిందిలే...

కోటవురట్ల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'ప్రతి రోజూ ఉదయం సూరీడును ఏం చూస్తారు.. నన్ను చూడండి' అంటూ కోటవురట్ల మండలంలో మంచు దుప్పటి ముసుగేసింది. శుక్రవారం ఉదయం 9 గంటలైనా మంచు కప్పేయడంతో వెలుతురు కానరాలేదు. ఈ క్రమంలో ప్రధాన రహదారుల్లో సైతం వాహనాలు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాయి. అనంతరం మంచు వీడడంతో మెల్లమెల్లగా సూరీడు బయటకు వచ్చి వెలుగును ప్రకాశింపజేశాడు. కాగా, మంచు ప్రభావంతో కూలీలు, ఇతర పనుల కోసం వెళ్లే ఆలస్యంగా బయలుదేరుతున్నారు.





కోటవురట్ల, కైలాసపట్నంలో మంచు తెరలనుంచి వాహనాల రాకపోకలు

పట్టాలు మంజూరు చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కుమారపురం రైతులు

పాయకరావుపేట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న భూముల రైతులకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం తహసీల్దారు సత్యనారాయణకు కుమారపురానికి చెందిన రైతులు వినతిపత్రం అందజేశారు.

కుమారపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబరు 312లో 44.04 ఎకరాల మెట్టు ఇసుక భూమిలో సుమారు 40 మంది తరతరాలుగా సాగుచేసుకుంటున్నట్టు రైతులు నీలాపు బాలానందరెడ్డి, రాజుబాబు, జనార్ధన రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, వరహాలమ్మ, ట్టిరెడ్డి, నీలాపు రమణారెడ్డి, అన్నారెడ్డి, బండిరెడ్డి, నాగిరెడ్డి, జోగిరెడ్డి తదితరులు తెలిపారు. ప్రభుత్వానికి శిస్తు కూడా చెల్లిస్తున్నామన్నారు. గతంలో పలుమార్లు పట్టాల కోసం అధికారులను కలిసి వినతిపత్రం అందించామని, ఇకనైనా స్పందించాలని వారు విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె.సురేశ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సౌభాగ్యేశ్వరీ అలంకరణలో శ్యామా అమ్మవారు


విశేష అలంకరణలో అమ్మవారు

సబ్బవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండ లంలోని దేవీపురం గ్రామంలో గల రాజరాజేశ్వరీ సహస్ర అమ్మవారి పీఠంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్ర ద్ధలతో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం శ్యామా అమ్మవారు సౌభాగ్యేశ్వరీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ముం దుగా అమ్మవారికి విశేష పూజలు, హోమాలు జరిపారు. సామూహిక కుంకుమార్చనలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. గరుపల్లి అన్నపూర్ణమ్మ, శ్రీ విద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


శ్యామా అమ్మవారిని దర్శించుకుంటున్న చిన్నారులు

ప్రభుత్వ భూమి ఆక్రమణపై డీటీకి ఫిర్యాదు


డీటీ సురేశ్‌నాయుడుకు వినతిని అందిస్తున్న సర్పంచ్ మసేను తదితరులు

పరవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిక్కవానిపాలెం సమీపం వాడచీపురుపల్లి ఈస్ట్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆ పంచాయతీ సర్పంచ్ చేపల మసేను, ముత్యాలమ్మపాలెం మాజీ సర్పంచ్ చింతకాయల ముత్యాలు కోరారు. ఈ మేరకు శుక్రవారం పరవాడ డిప్యూటీ తహసీల్దార్ కె.సురేశ్‌నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సింహాద్రి ఎన్టీపీసీ భూసేకరణలో ప్రభుత్వం తీసుకున్న భూమిని దిబ్బపాలేనికి చెందిన ఓ వ్యక్తి ఆక్రమించుకొని పాస్‌బుక్ చేయించుకున్నారని ఆరోపించారు. దీనిపై విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో విద్యార్థుల స్వచ్ఛ భారత్



స్వచ్ఛ భారత్‌లో పాల్గొన్న డీవీఎన్ కళాశాల విద్యార్థులు

తుమ్మపాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి ఆర్టీసీ బస్టాండ్ వద్ద శుక్రవారం దాడి వీరునాయుడు కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బస్ స్టాండ్‌ను శుభ్రం చేయడంతో పాటు పరిసర ప్రాంతాల్లో చెత్తా చెదారాన్ని తొలగించారు. పలువురు ప్రయాణికులకు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రవిచంద్ర మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు ఎస్ఆర్ జమీర్, యు.నాగేశ్వరరావు, జి.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

'బ్రాండిక్స్ ఉద్యోగులపై వేధింపులు అరికట్టాలి'



సమావేశంలో మాట్లాడుతున్న దొరబాబు

తుమ్మపాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అచ్యుతాపురంలో గల బ్రాండిక్స్ సంస్థలో ఉద్యోగుల పట్ల యాజమాన్యాల వేధింపులను తక్షణమే ఆపేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. ఇక్కడి సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. బ్రాండిక్స్‌లో ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి అదనంగా మరో అర గంట విధులు నిర్వహించాలని కంపెనీ యాజమాన్యాలు చెపుతుండడం దారుణమన్నారు. అదనంగా పనిచేయకుంటే విధుల నుంచి తొలగిస్తామని బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. కంపెనీల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని మాత్రమే అమలు చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. తక్షణమే యాజమాన్యాలు తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో కార్మికులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు కండేపల్లి త్రినాథ్, బొంది బాబ్జి, విత్తనాల పోతురాజు, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా అసకపల్లి- లంకెలపాలెం రహదారి మరమ్మతు పనులు

» గత ఐదేళ్లలో పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం

» కూటమి అధికారంలోకి రావడంతో నిధులు మంజూరు


రహదారి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సబ్బవరం, జనవరి31 (ఆంధ్రజ్యోతి) : అసకపల్లి- లంకెలపాలెం రహదారి మరమ్మతు పనులు జోరుగా సాగుతున్నాయి. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రోడ్ల దుస్థితిని పట్టించుకోక పోవడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల మరమ్మతులకు ప్రాధాన్యం ఇవ్వడంతో శరవేగంగా పనులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ఈ పనులను పరిశీలించారు. పనులను పక్కాగా నిర్వహించాలన్నారు. మెటీరియల్ నాణ్యతలో లోపాన్ని సహించేది లేదన్నారు. అనంతరం పలు సూచనలు చేశారు. ప్రస్తుతం పనులు జరుగుతుండడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి అప్పారావు, ధాట్ల మధు, కర్రి కనకరాజు, బంతికోళ్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఇంటర్ ప్రాక్టికల్స్

» జిల్లా పరీక్షల కమిటీ సమన్వయ సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం » 88 పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లపై ఆరా


జిల్లా పరీక్షల కమిటీ సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి) : జిల్లాలోని 88 పరీక్షా కేంద్రాల్లో ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి 20 వరకు జరగనున్న ఇం టర్మీడియట్ ప్రయోగ పరీక్షలు (ప్రాక్టికల్స్)ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఇందుకు సంబంధించి జిల్లా పరీక్షల కమిటీ సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రయోగ పరీక్షల నిర్వహణలో సమన్వయంతో పనిచేయాలని, ఏర్పాట్లు పక్కాగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు పరీక్షా కేం ద్రాల్లో లైట్లు, టాయిలెట్స్, డెస్కులు ఫర్నీచర్ తదితరాల గురించి అడిగి తెలుసుకున్నారు.

మొదటి విడతలో...

ఫిబ్రవరి ఒకటో తేదీన ఒకరోజు జరిగే నైతిక విలువలు పరీక్షకు మొదటి సంవత్సరం విద్యార్థులు 12,936 మంది, 133 పరీక్ష కేంద్రాల్లో హాజరు కానున్నారన్నారు. ఈ పరీక్ష ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని, అలాగే ఫిబ్రవరి మూడున పర్యావరణ విద్యా పరీక్షను మొదటి సంవత్సరం విద్యార్థులు ఇవే కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఈ పరీక్ష ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని ఆమె చెప్పారు.

రెండవ విడతలో...

ఫిబ్రవరి ఐదో తేదీ నుంచి 20వ తేదీ వరకు 39 పరీక్షా కేంద్రాల్లో మొదటి సంవత్సరం, రెం డవ సంవత్సరం వొకేషనల్ విద్యార్థులు 4,695 మంది హాజరవుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు జనరల్ ప్రయోగ పరీక్షలు ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మాత్రమే దాదాపుగా 9,247 మంది 62 పరీక్షా కేంద్రాల్లో హాజరవుతున్నట్లు తెలిపారు. జనరల్, వొకేషనల్ ప్రాక్టికల్స్ రెండు పూటలా ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయన్నారు. పరీక్షా కేంద్రాల్లోకి ఎట్టి పరిస్థితుల్లో మొబైల్, వాచ్, ఎలక్ట్రానిక్ తదితర వస్తువులను అనుమతించరాదని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ అధికారి బి.సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖా అధికారి పి.రవికుమార్, అనకాపల్లి ఆర్టీసీ డీఎం ఎం.వై.రవిచంద్ర, జీవీఎంసీ ఈఈ ఎస్.శేఖర్, డీఈసీ సభ్యులు శిరీషారాణి, ఎంవీఎస్ నాయుడు, విద్యుత్‌శాఖ ఎస్ఈ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయాల్లో భక్తిశ్రద్ధలతో ఆత్మార్పణ దినోత్సవం


అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కొణతాల


పట్టు వస్త్రాలు సమర్పించి మాజీ ఎమ్మెల్యే పీలా


సబ్బవరంలో ఎమ్మెల్యే పంచకర్ల పూజలు

తుమ్మపాల/కొత్తూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని శుక్రవారం అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు జరిపారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, కార్పొరేటర్ మాదంశెట్టి చినతల్లిలతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నసమారాధ ఏర్పాటైంది. వేడుకల్లో భాగంగా ఆలయ మండపంలో 102 వెండి ప్రమిదలతో దీపారాధన చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ కోరుకొండ బుచ్చిరాజు, కో-చైర్మన్ గ్రంధి శేషుకుమార్, ఆలయ అధ్యక్షులు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి జగదీశ్వరరావు, నాయకులు నీలబాబు, పోలారపు త్రినాథ్, సూరి సతీష్‌కుమార్, కొణతాల రత్నకుమారి, గుండా సాయి పాల్గొన్నారు.

సబ్బవరంలో...

సబ్బవరం : వాసవీమాత ఆత్మార్పణ వేడుకలను సబ్బవరంలో నిర్వహించారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు ముందు ఆర్యవైశ్యులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చుతుందన్నారు. వాసవీ క్లబ్ నాయకులు కోరిన విధంగా వాసవీమాత ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. వాసవీ క్లబ్ ప్రతినిధి, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షులు కొప్పాక శేషు, స్థానిక సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, వాసవీ క్లబ్ మండల అధ్యక్షులు దంగేటి సంతోష్ గుప్తా, మాజీ అధ్యక్షులు రామారావు, సభ్యులు పెన్నం సతీష్, దంగేటి ప్రకాశ్, పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు.

రిటైర్డు పోలీస్ అధికారులకు సన్మానం



పదవీ విరమణ పొందిన అధికారుల సత్కారంలో ఏఎస్పీ దేవప్రసాద్ తదితరులు

అనకాపల్లి రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పనిచేస్తూ పదవీవిరమణ పొందిన అధికారులకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. అనకాపల్లి సీసీఎస్ విభాగంలో పనిచేస్తున్న ప్రసాద్, మాడుగుల పీఎస్‌లో ఏఎస్ఐగా పనిచేస్తున్న సుబ్బరాజు, ఏఆర్ ఎస్ఐ రాజుబాబు, బుచ్చియ్యపేట పీఎస్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసరావు (వలంటీర్ పదవీవిరమణ) పొందిన వారిని శుక్రవారం ఏఎస్పీ దేవప్రసాద్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీవిరమణ పొందిన అధికారులు సుదీర్ఘకాలం పోలీస్ శాఖలో అంకితభావంతో చక్కని సేవలు అందించారని ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు త దితరులు పాల్గొన్నారు.

మామిడిపాలెంలో కాలుష్య తనిఖీలు

» గ్రామంలో వాయు కాలుష్య శాతాన్ని తెలిపే యంత్రాలు ఏర్పాటు

» ముందస్తు సమాచారంతో క్రషర్ల యాజమానులు అప్రమత్తం!

» అధికారుల తీరుపై సర్పంచ్ పరదేశినాయుడు ఆగ్రహం


ఓ ఇంటిపై అమర్చిన కాలుష్య తనిఖీ యంత్రం

తుమ్మపాల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మామిడిపాలెంలో శుక్రవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'మామిడిపాలెంలో కాలుష్యం' కథనానికి స్పందించి ఈ మేరకు గ్రామంలో కాలుష్య తనిఖీల యంత్రాలను అమర్చారు. 24 గంటల పాటు ఈ యంత్రాలు వాయు కాలుష్య శాతాన్ని తెలియజేస్తాని అధికారులు వివరించారు. ఇదిలావుంటే, ముందస్తు సమాచారంతో మామిడిపాలెం గ్రామ నలుమూలలా ఉన్న క్రషర్ల యాజమాన్యాలు తమ క్రషర్లలో ఎలాంటి పనులు జరగకుండా అప్రమత్తమయ్యారు. మిషన్‌లను ఆఫ్ చేసి గైర్హాజరయ్యారు. దీనిపై గ్రామ సర్పంచ్ పూడి పరదేశినాయుడు మాట్లాడుతూ అధికారులు, యాజమాన్యాలు కుమ్మక్కై తప్పుడు నివేదికలను ఉన్నతాధికారులకు అందించేందుకు చూస్తున్నారని ఆరోపించారు. ప్రతి రోజూ పనిచేసే క్రషర్ల అర్ధంతరంగా ఆగిపోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అధికార యంత్రాంగం నిష్పక్షపాతంగా విధులు నిర్వహించి ప్రజలను కాలుష్యం బారినుంచి కాపాడాలని కోరారు.

ఉత్సాహంగా జిల్లాస్థాయి గుర్రపు పరుగు పందెం


గుర్రపు పరుగు పందేలను వీక్షించేందుకు విచ్చేసిన జనం

కశింకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నర్సాపురంలో జిల్లాస్థాయి గుర్రాల పరుగు పందేలు శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. జిల్లా నలుమూలల నుంచి పన్నెండు గుర్రాలతో ఆయా యజమానులు హాజరయ్యారు. ప్రథమ స్థానంలో రామన్నపాలేనికి చెందిన విక్రమ్, రెండవ స్థానంలో భోగాపురానికి చెందిన జేసీ మణికంఠ, మూడవ స్థానంలో కోటనందూరు బ్రదర్స్ శివరాజు, నాల్గవ స్థానంలో యలమంచిలికి చెందిన వెల్ మురగన్, ఐదవ స్థానంలో రామన్నపాలెంకు చెందిన ధర్మిరెడ్డి అప్పారావు గుర్రాలు నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. వైఎస్ రాజశేఖరరెడ్డి తీర్థం సందర్భంగా జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, అంబటి రాంబాబు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిశోర్, మాజీ సర్పంచ్ మలసాల అనురాధ, వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి మలసాల భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూల స్వయంభూవరాన్ని వీడని మురుగు

» డ్రైనేజీలు లేక రహదారిపై తిష్ఠ » దుర్వాసన, దోమలతో ఇబ్బందులు


గ్రామంలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు నీరు

పరవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సోమునాయుడుపాలెం నుంచి మూల స్వయంభూవరం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి మురుగు ప్రవాహంతో అధ్వానంగా మారింది. మూల స్వయంభూవరం గ్రామంలో పూర్తిస్థాయిలో డ్రైనేజీలు నిర్మించకపోవడంతో వాడుకనీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ కారణంగా పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు వల్ల ఈగలు, దోమలు వృద్ధిచెందుతున్నాయని వాపోతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డ్రైనేజీల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరవాడ, తానాంలో పశువైద్య శిబిరాలు


పరవాడలో పాడి రైతులకు సూచనలిస్తున్న ఏడీ రామకృష్ణ

పరవాడ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను పాడి రైతులంతా సద్వినియోగపరుచుకోవాలని పరవాడ పశువైద్యశాల సహాయ సంచాలకులు కీర్తి రామకృష్ణ కోరారు. పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పరవాడ, తానాం గ్రామాల్లో నిర్వహించిన పశువైద్య శిబిరంలో ఆయన మాట్లాడారు. పశువుల వ్యాధులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే పశువైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం పశువైద్య సిబ్బంది నట్టల నివారణ మందులు పంపిణీ చేసి, పలు పశువులకు వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ నిర్ధారణ పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు సురేశ్‌కుమార్, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

పరవాడ ఇన్‌చార్జి ఎంపీడీవోగా ధర్మారావు


ధర్మారావు

పరవాడ, జనవరి 31 (ఆంధ్ర జ్యోతి) : ఇక్కడి మండల పరిషత్ ఇన్‌చార్జి డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా కె.ధర్మారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తు తం ఈయన పంచాయతీ విస్తరణాధికారిగా పనిచేస్తున్నారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీడీవోగా పనిచేసిన ఎస్‌డీ శ్యామ్‌సుందర్ విధి నిర్వహణలో దురుసుగా ప్రవర్తించి, వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌కు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో గురువారం అతనిని సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. దీంతో ఖాళీగా ఉన్న ఈ పోస్టుకు ఇన్‌చార్జిగా ధర్మారావును నియమిస్తూ జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా అభయాంజనేయ తీర్థం


పూజలందుకున్న స్వామి

సబ్బవరం, జనవరి 30 (ఆం ధ్రజ్యోతి) : మండలంలోని ఆరి పాక శివారు పెద యాతపాలెంలో అభయాంజనేయ తీర్థాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం ఏర్పాటైన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ పెద్దలు ఆడారి నాగరాజు, శరగడం శంకరరావు, ఆడారి వెంకట్, కాళ్ల శ్రీను తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

నేడు షిర్డీసాయిబాబాకు ప్రత్యేక పూజలు

పరవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌతు లచ్చన్ననగర్‌లోని షిర్డీసాయి సేవా ట్రస్ట్ వార్షికోత్సవ వేడుకలను శని, ఆదివారాల్లో నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. దీనిలో భాగంగా సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయన్నారు. అలాగే పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.

11మద్యం బాటిళ్లతో ఒకరి అరెస్టు

కశింకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : జమాదులపాలెం గ్రామ శివారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని శుక్రవారం పట్టుకుని అరెస్టు చేశామని ఎక్సైజ్ ఎస్ఐ కె.ఎస్.గణేశ్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా పదకొండు మద్యం బాటిళ్లతో పడాల రాము పట్టుబడ్డాడన్నారు. ఈ మేరకు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్టు చెప్పారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

కశింకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మూడో తేదీ సోమవారం కశింకోటలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు సంఘ అధ్యక్షుడు పాము సూర్యనారాయణ, కార్యదర్శి గోపి తెలిపారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ కంటి వైద్య నిపుణులు హాజరై కంటి పరీక్షలు జరుపుతారన్నారు. కంటి సంబంధిత సమస్యలు ఉన్న వారు సంఘం భవనంలో జరగనున్న శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా వారు కోరారు.

'ధ్రువ పత్రాల జారీలో జాప్యం తగదు'

కొత్తూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని ప్రజలకు అవసరమైన వివిధ ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో తీవ్రమైన ఆలస్యం జరుగుతుందని బహుజన్ సమాజ్ పార్టీ అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గకన్వీనర్ సూదికొండ మాణిక్యాలరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు పొందేందుకు అవసరమైన పుట్టిన తేదీ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలకు పలువురు దరఖాస్తులు చేసుకున్నా జారీ విషయంలో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఈ సమస్యపై స్పందించాల్సిందిగా ఆయన కోరారు.

విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై ఫిర్యాదు

పెందుర్తి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం విధి నిర్వహణలో ఉన్న తన పనులకు ఆటంకం కలిగించడంతో పాటు దురుసుగా ప్రవర్తించిన వ్యక్తిపై విశాఖ ఆర్డీవో శ్రీలేఖ శుక్రవారం పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ కేవీ సతీశ్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో జనవరి 27న నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ఆర్డీవో హాజరై ప్రజల నుంచి అర్జీల స్వీకరణ చేపట్టారు. ఈ క్రమంలో మురళీనగర్‌కు చెందిన డీవీ మహేశ్ అనే వ్యక్తి వేపగుంటలోని ఓ స్థల సమస్యకు సంబంధించిన పత్రాలతో వచ్చాడు. ఆయ నకు కాసేపు వేచివుండాలని సిబ్బంది తెలిపారు. దీంతో సదరు వ్యక్తి తన ఎదుట అసహనం వ్యక్తం చేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించి, దురుసుగా ప్రవర్తించాడని ఆర్డీవో ఫిర్యాదు చేశారు.


దశాబ్ద కాలంగా వదిలేసిన ఏఎన్ఎం, అంగన్‌వాడీ, ఏఎన్ఎం భవనాలు


తుప్పు పట్టిపోయిన మోటారు, బోరు

రూ.లక్షలు వెచ్చించారు-వృథాగా వదిలేశారు

- రూ. 20 లక్షలతో కంతారం పీహెచ్‌సీ ఆవరణలో ఏఎన్ఎం క్వార్టర్, అంగన్‌వాడీ భవన నిర్మాణాలు
- పదేళ్లుగా వాడకుండా వదిలేసిన వైనం

కొయ్యూరు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి) మండలంలోని కంతారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో ఏఎన్ఎం నివాసానికి, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణకు వీలుగా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన భవనం పదేళ్లుగా నిరుపయోగంగా దర్శనమిస్తోంది. 2015లో అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోఈ పీహెచ్‌సీ ఆవరణలో ఈ సబ్ సెంటర్ కమ్ అంగన్‌వాడీ కేంద్రం భవనానికి గానూ రూ. 20 లక్షలు నిధులు కేటాయించారు. ఈ నిర్మాణ బాధ్యత వైద్యాధికారికి అప్పగించారు. గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ విభాగ పర్యవేక్షణలో 2015 మే నెలలో భవన నిర్మాణ పనులు ప్రాంభించి 2016 ఫిబ్రవరి నిర్మాణాలు పూర్తి చేశారు. అనంతరం మరో రూ. 60 వేల ఖర్చుతో నీటి వసతికి వీలుగా బోరు, మోటారు ఏర్పాటు చేశారు. భవనం అయితే నిర్మించారు తప్పితే నాటి నుంచి వినియోగంలోకి తెచ్చిన దాఖలాలు లేవు. ఏఎన్ఎం సబ్ సెంటర్ నిర్వహణకు పీహెచ్‌సీ పక్కనే ఉండటంతో సబ్ సెంటర్ కార్యకలాపాలు జరపలేదు. అంగన్‌వాడీ కేంద్రం గ్రామంలో మరో భవనం ఉండటంతో దీర్ఘ కాలంగా కొనసాగుతోంది. దీంతో భవనం నిరుపయోగంగా వదిలారు. లక్షలు వెచ్చించిన ఈ భవనాన్ని కనీసం వేరే అవసరాలకు వినియోగించాలనే ఆలోచన ఆయా వైద్యాధికారులలో రాక పోవటంతో ప్రజా ధనం వృథా అవుతోంది. పీహెచ్‌సీలో రోగులకు ఇరుకు గదులలో ఇబ్బందులు పడుతున్నారు. కానీ, నాలుగు అడుగులు దూరంలో ఈ నూతనం భవనంలోకి వెళ్ళేందుకు సిబ్బంది పడుతున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఈ భవనం నిరుపయోగంగా ఉంచటమే కాకుండా ఇటీవల భర్త్ వెయిటింగ్ హాల్‌కు మరో రూ. 50 లక్షలు నిధులు కేటాయించారు.ఉన్న భవనాన్ని వదిలేసి అదనంగా నిర్మాణాలతో ఏమి న్యాయం జరుగుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

మ్యాక్స్ ఉత్పత్తి చేసిన కాఫీ గింజలకు గరిష్ఠ ధర

- కిలో రూ.498 ధరకు కొనుగోలు చేసిన ఐటీసీ కంపెనీ
- కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ అప్పలనాయుడు


ఐటీసీ కంపెనీకి సరఫరా చేసేందుకు కాఫీ గింజలను సిద్ధం చేస్తున్న కార్మికులు, ఏడీ అప్పలనాయుడు

చింతపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మ్యాక్స్ ఎకో పల్పింగ్ యూనిట్‌లో ఉత్పత్తి చేసిన కాఫీ గింజలకు గరిష్ఠ ధర లభించిందని, బెంగుళూరు ఐటీసీ నాలుగో విడత కాఫీ పార్చిమెంట్ కిలో రూ.498ధరకు కొనుగోలుకు ముందుకువచ్చినట్టు ఐటీడీఏ కాఫీ ప్రాజెక్టు అసిస్టెంట్ డైరెక్టర్ జి. అప్పలనాయుడు తెలిపారు. శుక్రవారం కాఫీ గింజలను ఐటీసీ కంపెనీకి ఎగుమతి చేసేందుకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ ఆదివాసీ కాఫీ రైతులకు అంతర్జాతీయ ధరలు అందించాలనే లక్ష్యంతో మ్యాక్స్ మార్కెటింగ్ సదుపాయం కల్పినట్టు పేర్కొన్నారు. ఇప్పటి వరకు 621టన్నుల కాఫీ పండ్లను రైతుల నుంచి సేకరించి 100 టన్నుల కాఫీ పార్చిమెంట్‌ను ఉత్పత్తి చేసినట్టు వివరించారు. తొలివిడతగా ఐటీసీ కంపెనీకి పార్చిమెంట్ కాఫీ 6 టన్నులు కిలో రూ.450, రెండో విడత 20 టన్నులు రూ.452, మూడో విడత 40 టన్నులు కిలో రూ.468 ధరలకు విక్రయించినట్టు చెప్పారు. ప్రస్తుతం నాలుగో విడతగా 27టన్నులు రూ.498ధరకు విక్రయిస్తున్నామన్నారు. అల కాఫీ గింజలను లోడ్ చేసి బెంగళూరు పంపిస్తున్నామన్నారు. రైతులు నుంచి సేకరించి కాఫీ పండ్లు కిలోకి తొలివిడతగా రూ.44ధర చెల్లించామన్నారు. ఇప్పటి వరకుకాఫీ గింజలు విక్రయించగా వచ్చిన ఆదాయం నుంచి రైతులకు బోనస్‌గా కిలోకి రూ.8 చెల్లిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో మ్యాక్స్ చైర్మన్ సెగ్గె కొండలరావు పాల్గొన్నారు.

గంజాయి నియంత్రణకు ప్రత్యేక చర్యలు: పాడేరు డీఎస్పీ


డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన షాబాద్ అహ్మద్

పాడేరురూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గంజాయి సాగు, రవాణా నియంత్రణతోపాటు శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని పాడేరు నూతన డీఎస్పీ ఎస్‌కే. షాబాద్ అహ్మద్ తెలిపారు. బదిలీల్లో భాగంగా స్థానిక డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న కె.ప్రమోద్ ఆళ్లగడ్డకు వెళ్లగా.. చింతపల్లినుంచి అహ్మద్ ఇక్కడకు వచ్చారు. శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. మన్యంలో పరిస్థితులపై అవగాహన ఉందన్నారు. పాడేరు, పరిసర ప్రాంతాల్లో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు. గంజాయి నిరోధానికి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ డి.దీనబంధు పాల్గొన్నారు.

నేతల విగ్రహాలకు ముసుగు


చింతపల్లి రాజకీయ నేత విగ్రహానికి ముసుగు వేసిన అధికారులు

చింతపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మండలంలో రాజకీయ నేతల విగ్రహాలకు అధికారులు ముసుగులు వేసి, పలు పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో రావడంతో అధికారులు శుక్రవారం మండల కేంద్రంతోపాటూ పలు గ్రామాల్లోనున్న వివిధ పార్టీల నాయకులు విగ్రహాలకు ముసుగులువేశారు. పార్టీల ఫ్లెక్సీలను తొలగించారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ రాజకీయ నేత చిత్రాలను తొలగించారు. రాజకీయ పార్టీలు కచ్చితంగా నియమావళిని పాటించాలని ఎంపీడీవో యూఎస్‌వీ శ్రీనివాసరావు ఈ సందర్భంగా తెలిపారు.

జీకేవీధిలో అమలుకాని నియమావళి


రింతాడ జంక్షన్‌లో తొలగించని రాజకీయ పార్టీ ఫ్లెక్సీ

చింతపల్లి: జీకే వీధి మండలంలోని ఎన్నికల కోడ్ అమలులో అధికారులు విఫలమయ్యారు. కోడ్ అమలులోకి వచ్చి మూడు రోజులవున్నా, పలు గ్రామాల్లో రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు అలానే ఉన్నాయి. అలాగే, నేతల విగ్రహాలకు ముసుగులువేయలేదు. చింతపల్లి - కృష్ణాదేవిపేట జాతీయ రహదారి రింతాడ జంక్షన్ వద్ద పలు పార్టీల ఫ్లెక్సీలు ఇప్పటికీ దర్శనమిస్తున్నాయి. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థవంతంగా అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

పాడేరు రూరల్: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు, జెండాలను పంచాయతీ ఈవో (పీఆర్‌ఆర్‌డీ) పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఈ కార్యక్రమంలో పాడేరు పరిధిలోని మూడు సచివాలయాల సెక్రటరీలు, సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్‌యూ నేతలకు నివాళి


కిలగాడ గ్రామం వద్ద నివాళులు అర్పిస్తున్న నాయకులు

ముంచంగిపుట్టు: రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గిరిజన విద్యార్థి సంఘం(జీ.ఎస్.యూ) నాయకులు అమరులై నేటికి 25 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పలువురు నాయకులు శుక్రవారం వారికి ఘన నివాళులర్పించారు. ఈ ప్రమాదం జరిగిన స్థలం వద్ద స్థూపం ఏర్పాటు చేసి, ఆ సంఘం జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా జీఎస్‌యూ నేతలు మాట్లాడుతూ 1999లో విశాఖపట్నంలో జరిగిన ఆదివాసీ హక్కుల బహిరంగ సభకు వెళ్లి తిరుగు ప్రయాణంలో మండలంలోని కిలగాడ మలుపు వద్ద జరిగిన ప్రమాదంలో నాయకులు ముంచంగిపుట్టు మండలం చోటాముక్కిపుట్టుకు చెందిన కె.సురేంద్ర, పెదబయలు మండలం బంగారుమెట్టకు చెందిన కె.కొండబాబు, ఎం.జయరాములు మృతి చెందారని తెలిపారు. వారి ఆశయ సాధనకు నిరంతరం కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కె.కిశోర్ కుమార్, ప్రధాన కార్యదర్శి బి.మాధవరావు, నాయకులు ఎం.బాబూజీ, సమన్వయకర్త పూజారి సురేశ్‌కుమార్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాల పరిరక్షణ కోసం ప్రాణ త్యాగానికైనా సిద్ధం

- సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ

పాడేరురూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి): గిరిజన చట్టాలు, హక్కులను ప్రాణాలను పణంగా పెట్టయినా పరిరక్షించుకుంటామని సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1/70 చట్టం జోలికి ఎవరు వచ్చినా సహించబోమని హెచ్చరించారు. అనేక మంది ఆదివాసీల బలిదానంతో ఈ చట్టం వచ్చిందన్నారు. ఈ చట్ట సవరణకు సాక్షాత్తు అసెంబ్లీ సభాపతి అయ్యన్న పాత్రుడు మాట్లాడటం ఆదివాసీలను అవమానపరచరడమేనని అన్నారు. సభాపతి మాటల వెనుక కూటమి ప్రభుత్వ రహస్య ఎజెండా ఏమైనా ఉందా అని ఆయన ప్రశ్నించారు. ఇప్పటికే ఆదివాసుల భూములను కార్పొరేట్ శక్తులకు హైడ్రో పవర్ ప్రాజెక్టులు వంటి వాటిని అప్పగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పందాలు చేసుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు చంటి, జల్లి రాజుబాబు, కె.రాధాకృష్ణ పాల్గొన్నారు.

స్పీకర్ వ్యాఖ్యలపై ప్రభుత్వం ప్రకటన చేయాలి

సీలేరు: భూ బదలాయింపు చట్టంపై అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని జీకేవీధి మండలంలోని వివిధ గిరిజన సంఘాల నేతలు డిమాండ్ చేశారు. శనివారం దుప్పులవాడలో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1/70 చట్టం సవరణతోనే ఏజెన్సీ ప్రాంతంలో పెట్టుబడులు రావడానికి అవకాశాలు ఉంటాయని స్పీకర్ చేసిన వ్యాఖ్యలు గిరిజనుల హక్కులను హరించడమేనని అన్నారు. ఉన్నతమైన పదవిలో ఉన్న స్పీకర్ ఇటువంటి వాఖ్యలు చేయడం సరికాదని అన్నారు. ఏజెన్సీ అభివృద్ధి పర్యాటకం, పరి శ్రమల ద్వారా అభివృద్ధి అనడం భావ్యంగాకాదన్నారు. ఈ ప్రాంత అభివృద్ధికి చిన్నతరహా పరిశ్రమలను ఐటీడీఏ ద్వారా ఏ ర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు కొర్రా మార్క్ రాజు, గొర్లి గణేశ్వరరాజు, బాకూరి కోటేశ్వరావు, మనోజ్‌కుమార్, పెసా కమిటీ అధ్యక్షులు , కార్యదర్శులు శెట్టి రాంబాబు, వంతల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


దుప్పులవాడలో సమావేశమైన వివిధ సంఘాల గిరిజన నాయకులు

భూ బదలాయింపు చట్టం జోలికి రావద్దు:కాంగ్రెస్

చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతంలో ఆదివాసీల భూములకు రక్షణ కవచంగా ఉన్న భూ బదలాయింపు చట్టం జోలికి వస్తే సహించేదిలేదని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర చైర్మన్ రీమల భరత్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 1/70 చట్టం ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కు అ న్నారు. ఈ చట్టాన్ని పటిష్టం చేయాల్సిన ప్రభుత్వాలు నీరుగార్చేందుకు ప్రయత్నించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికే ఈ చట్టం సక్రమంగా అమలు కావడంలేదని, ఇక సవరిస్తే ఆదివాసీలు అన్యాయమైపోతారని ఆందోళన వ్యక్తంచేశారు. ఈచట్టాన్ని సవరణ రాజ్యాంగం పరిధిలో ఉన్నదన్నారు. ఈ స్థితిలో స్పీకర్ వ్యాఖ్యలపై సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌కి కాంగ్రెస్ ఎస్టీసెల్ లేఖరాసినట్టు తెలిపారు.

మత్తుకు యువత దూరంగా ఉండాలి: కలెక్టర్


స్వచ్ఛ సంకల్పం పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు

అనంతగిరి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని కలెక్టర్ దినేశ్‌కుమార్ హితవు పలికారు. శు క్రవారం మండలంలో అరకు ఉత్సవ్‌లో భాగంగా ఏర్పాటుచేసిన 5రన్ మారథన్ పోటీలకు ముందుగా.. మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా అడిషనల్ ఎస్పీ ధీరజ్ ఆధ్వర్యంలో కలెక్టర్, విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ సివేరి దొన్నుదొర స్వచ్ఛ సంకల్పం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గంజాయి రవాణా, సాగు వంటి వాటికి దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. గంజాయి రహిత జిల్లాగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని పిలుపునిచ్చారు. యువత ఉద్యోగ అవకాశాలపై దృష్టిసారించాలని కోరారు.గిరిజన ప్రాంతంలో ఉన్న ఆదాయ మార్గాలెక్కడాలేవని, వీటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తుల్లో ఉన్న తంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలోని జేసీ అభిషేక్ గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్, సబ్ కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, తదితరులు పాల్గొన్నారు.

4 వేల ఎకరాల్లో ఉద్యాన పంటల సాగుకు ప్రణాళిక


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీవో రాజు

చింతపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2025-26 వార్షిక సంవత్సరంలో నాలుగు వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగుకు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్టు ఉపాధి హామీ పథకం ఏపీవో రాజు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి పథకం టీఏ, ఎఫ్ఏలలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకం ద్వారా ఏడాది ఉద్యాన పంటల సాగును ప్రోత్సహిస్తున్నామన్నారు. ప్రధానంగా డ్రాగన్‌ఫ్రూట్, జామ, నిమ్మ, నారింజ, సపోటా, ఉసిరి, సీతాఫలం, జీడిమామిడి పంటలను సాగు రైతులకు ప్రోత్సాహాలు అందిస్తున్నట్టు చెప్పారు. ఈ ఏడాది ఉద్యాన పంటల సాగుపై ఆసక్తిగల రైతులను ఎఫ్ఏలు ఎంపిక చేయాలన్నారు. ఒక్కొక్క రైతు కనిష్ఠంగా అరెకరం నుంచి గరిష్ఠంగా ఎకరం విస్తీర్ణంల సాగు చేసుకోవచ్చునన్నారు. అలాగే ప్రతి గృహం వద్ద ఇంకుడు గుంతలు నిర్మించాలన్నారు. 850 గృహాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు ఎంపిక చేశామని, ఇతర గృహాలను ఎఫ్ఏలు సర్వే చేసి నిర్మాణాలకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి కూలీలందరికీ వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు.

అరకు విశిష్టతను చాటిన ఘనత కూటమి ప్రభుత్వానిదే..

- జనసేన అరకు పార్లమెంటరీ నాయకుడు వీర వెంకట్


మాట్లాడుతున్న వీరవెంకట్

గూడెంకొత్తవీధి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అరకు విశిష్టతను ఖండాంతరాలకు విస్తరింపజేసిన ఘనత కూటమి ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందని జనసేన పార్టీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ నాయకుడు గొర్లె వీర వెంకట్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు అరకు కాఫీకి దేశ, విదేశాల్లోనూ మంచి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ప్రధాన నరేంద్ర మోదీ సహకారంతో స్వదేశీ దర్శన్ 2.0 పథకంలో భాగంగా అరకు, లంబసింగి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. తాజాగా. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడంతోపాటూ అరకు ఖ్యాతిని పెంపొందించేందుకు అత్యంత వైభవంగా ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. దీంతో గిరిజన ప్రాంతంలోనున్న వైసీపీ నాయకులు మతి భ్రమించినట్టు ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారన్నారు. చివరికి అరకు ఉత్సవాలను సైతం రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. వైసీపీ ప్రభుత్వం పార్టీ స్టిక్కర్లు, రంగులతో ప్రచారానికే రూ.కోట్ల నిధులు దుర్వినియోగం చేసిందన్నారు. అరకు ఉత్సవాల వల్ల గిరిజన ప్రాంతం పర్యాటకపరంగా అభివృద్ధి చెందుతుందని, గిరిజనులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నా రు. ప్రజల ఓట్లతో వైసీపీనుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు శాసన సభకు వెళ్లకపోతే ఆదివాసీల సమస్యలు చట్టసభలో ఎవరు ప్రస్తావిస్తారు. గిరిజన ప్రాంతంలో కూటమి అభ్యర్థులు గెలవకపోయినా ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు.

వెదురు బొంగులకు గిరాకీ


భీమనాపల్లిలో వెదురు బొంగును కొనుగోలు చేస్తున్న పర్యాటకుడు

చింతపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రకశ్మీర్ లంబసింగిలో వెదురు బొంగులకు డిమాండ్ పెరిగింది. లంబసింగి వచ్చిన పర్యాటకులు వీటిని కొనుగోలు చేసుకుని తమ వెంట తీసుకువెళ్తున్నారు. శుక్రవారం చెరువులవేనం వ్యూపాయిం ట్ దిగువన గిరిజనుల వద్దనుంచి వెదురు బొంగులను పర్యాటకులు కొనుగోలుకు ఆసక్తి చూపారు. బొంగులు మైదాన ప్రాంతంలో దొరకడంలేదని,ఇక్కడనుంచి తీసుకువెళ్లిన వాటితో బొంగు చికెన్, మటన్, బిర్యాని తయారు చేస్తామని పర్యాటకులు తెలిపారు. గిరిజనులు ఒక్కో బొంగును రూ.20-25 ధరకు విక్రయించారు.

గృహాలకు గిరిజనులు దరఖాస్తు చేసుకోవాలి

చింతపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పక్కా గృహాలకు అర్హులైన గిరిజనులు గ్రామ సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని టీడీపీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం పక్కా గృహాల నిర్మాణాలకు పెద్దపీట వేసిందన్నారు. గిరిజన ప్రాంతానికి భారీ మొత్తంలో పీఎం ఆవాస్ యోజన 2.0పక్కా గృహాలు మంజూరు చేసిందన్నారు. ప్రస్తుతం పంచాయతీ కార్యదర్శి, వెల్ఫేర్ అసిస్టెంట్లు అర్హులైన గిరిజనుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు పక్కా గృహాల కోసం 2,889మంది దరఖాస్తులు చేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, జనసేన పార్టీ మండలాధ్యక్షుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ మాత ఆత్మార్పణ దినం

- అమ్మవారికి సారె సమర్పణ


వాసవీ మాతకు సారె సమర్పిస్తున్న ప్రతినిధులు

పాడేరురూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వాసవీ మాత అమ్మవారి ఆత్మార్పణ దినంను స్థానిక వాసవీ క్లబ్, పాడేరు హిల్స్, వనితా మోదమాంబ క్లబ్‌ల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి కుంకుమపూజలు, పాలాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేపట్టారు. సాయంత్రం ఊరేగింపు, సారె కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు ఆలయంలో మహిళలు దీపారాధనను పోటాపోటీగా చేపట్టారు. వాసవీ మాత అమ్మవారికి వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనాధు శ్రీను దంపతులు పట్టు చీర, పసుపు కుంకుమలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మూడు క్లబ్‌ల ప్రతినిధులు సంతోష్, రమేశ్, అప్పారావు, ఎస్.మణి, ఎస్.శ్రావణి, ఎస్.రూపపార్వతి, పి.నానాజీ, ఎస్.మణి, ఎస్.శిరీష, శ్రీనాథరాజు, పినాది లక్ష్మణమూర్తి, శ్రీనాధు గోవింద, సత్తిబాబు క్లబ్ మెంబర్లు పాల్గొన్నారు.

వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వెటర్నరీ డాక్టర్ సౌజన్య దేవి

ముంచంగిపుట్టు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వన్య ప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అని కిలగాడ పశు వైద్యాధికారి మత్స్యరాస సౌజన్య దేవి అన్నారు. మండలంలోని కిలగాడ కేజీబీవీలో విద్యార్థులకు జంతు సంక్షేమం, చట్టాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వన్య ప్రాణులను బంధించినా, వాటికి ఇబ్బందులు కలిగించినా కఠిన శిక్షలు పడతాయని చెప్పారు. విద్యార్థి దశ నుంచే జంతు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ ప్రిన్సిపాల్ సాయిప్రసన్న, ఏహెచ్‌ఏలు రఘునాథ్, రఘురామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే కఠిన చర్యలు'

ముంచంగిపుట్టు, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ,పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మార్చి 3 వ తేదీ వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, దీనిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక తహసీల్దార్ నర్సమ్మ అన్నారు. విలేకరులతో ఆమె మాట్లాడుతూ ఎమెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 3న నోటిఫికేషన్ జారీ, 10వ తేదీన నామినేషన్ పత్రాలు స్వీకరణ, 11వ తేదీలోగా నామినేషన్లు ఉపసంహరణ, 27వ తేదీన ఎన్నికలు జరుగుతాయని, మార్చి 3న ఓట్లు లెక్కింపు ఉంటుందని తెలిపారు. ఎన్నికలు ముగిసే వరకు కోడ్‌ను అందరూ పాటించాలన్నారు. రాజకీయ పార్టీలైనే వీటిని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆమె చెప్పారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి


రోడ్డు భద్రతపై అవగాహనకు మానవహారం చేపట్టిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

పాడేరురూరల్, జనవరి 31(ఆంధ్రజ్యోతి):ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్‌ను ధరించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ టీఎస్ రసూల్ కోరారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ కూడలిలో మానవహారం చేపట్టారు. ట్రాఫిక్ ని బంధనలు, హెల్మెట్ వినియోగం తదితర వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు వి.రమేశ్‌బాబు, పి.జానకీరామ్, జి.గౌరీశంకరరావు, వి.శంకరరావు, సీహెచ్.అచ్యుత్, అధ్యాపకులు పి.కోటేశ్వరరావు, ఎ.మురళీధరరావు, డి.గణేష్, జి.దామోదరరావు, జి.భాస్కరరావు, మత్స్యరాజు, మణికుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పాడేరురూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నాబార్డ్ వారి ఆర్థిక సహాయంతో పాడేరు, హుకుంపేట ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ల ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహనపై రాజమహేంద్రవరానికి చెందిన విభూది బ్రదర్స్ కళాజాత బృందం శుక్రవారం పాడేరు పాత బస్టాండ్, డి.చింతలవీధి గ్రామాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బ్యాం కు అమలుచేస్తున్న స్కీమ్స్, ప్రధాన మంత్రి జీవనజ్యోతి పథకం 436 ప్రధాన మంత్రి జీవనజ్యోతి, 20 ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్పీఎస్ వాత్సల్య, పీఎం విశ్వకర్మ, ముద్ర రుణాలలతో పాటు సైబర్ నేరాల గురించి కళాబృందం సభ్యులు వివరించార సైబర్ మోసానికి గురైతే 1930కు కాల్ చేసి తెలియజేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది, గ్రామ పెద్దలు, రైతులు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.



నర్సీపట్నం సబ్ జైల్‌లో సివిల్ జడ్జి షియాజ్‌ఖాన్

సబ్ జైలును సందర్శించిన సివిల్ జడ్జి

నర్సీపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పి.షియాజ్ ఖాన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీల వివరాలపై ఆరా తీశారు. ఎంత మంది ఉన్నారు? ఏయే నేరాలు చేశారు? తదితర వివరాలు అడిగారు. బెయిలు కోసం న్యాయ సహాయం గురించి దరఖాస్తు పెట్టుకుంటే ఏర్పాటు చేస్తామని రిమాండ్ ఖైదీలతో చెప్పారు. భోజన సదుపాలయం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.

చోడవరం సబ్ జైలు సందర్శన

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ జైలును స్థానిక ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.గౌరీశంకరరావు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా జైలులోని రిమాండ్ ఖైదీలకు కల్పిస్తున్న సౌకర్యాలు, భోజన వసతి, ఇతర సమస్యలపై ఖైదీలతో మాట్లాడారు. జైలులో సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాని, న్యాయవాదులను పెట్టుకోలేని ఖైదీలు న్యాయ సేవాధికార సంస్థ సహకారం పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో ప్యానెల్ లాయర్ భూపతి రాజు, సబ్ జైలు వార్డెన్ వీర్రాజు పాల్గొన్నారు.

2న సామూహిక అక్షరాభ్యాసం

నాతవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): తాండవ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు వసంతి పంచమిని పురస్కరించుకుని ఆదివారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ఆవరణలో ఉన్న సరస్వతిదేవి మండపం వద్ద ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అక్షరాభ్యాసం చేయించుకునే వారు పూజ సామగ్రి తీసుకు రావాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

కుక్కల బీభత్సం.. భీతిల్లుతున్న జనం!

గుంపులు గుంపులుగా వస్తున్నాయి.. మూకుమ్మడిగా సంచరిస్తున్నాయి.. రహదారులకు అడ్డంగా తిరుగుతున్నాయి.. పశువులు, చిన్నారులపై కలబడుతున్నాయి.. ఎవరైనా ఒంటరిగా కనిపిస్తే దాడులకు తెగబడుతున్నాయి.. వాహన చోదకుల వెంట బడుతున్నాయి.. ఏమాత్రం భయపడినా మీదపడి తరుముతున్నాయి.. మొత్తానికి ప్రజలను భయకంపితులను చేస్తున్నాయి. ఇదీ చోడవరం మండల కేంద్రంలో కుక్కలు సృష్టిస్తున్న బీభత్సం!

చోడవరంలో స్వైరవిహారం

రహదారులపై గుంపులు గుంపులుగా సంచారం

పశువులు, చిన్నారులు, వాహన చోదకులపై దాడులు

బయటకు రావాలంటేనే భయపడుతున్న ప్రజలు

ఏమాత్రం పట్టించుకోని అధికార యంత్రాంగం

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): 'ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్టుగా తయారైంది' చోడవరం ప్రజలు పరిస్థితి. కుక్కల నిర్మూలనకు చట్టాలు అనుమతించడం లేదన్న కారణంతో పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడం మానేశారు. దీంతో కుక్కల బెడద విపరీతంగా పెరిగిపోయింది. చోడవరంలో దాదాపు ప్రతీ వార్డులోనూ వీధి కుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి.

చోడవరంలో ప్రధానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ పరిసరాలు, తహసీల్దార్ కార్యాలయం, కొత్తూరు జంక్షన్, కోటవీధి, సాయిబాబా ఆలయం, ఆంధ్రాబ్యాంకు రోడ్డు, ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి పరిసరాలు, దేవరాపల్లి రూట్, పెదబజారు, చిన బజారువీధి, అన్నవరం, వెంకయ్యగారి పేట, ద్వారకానగర్, బాలాజీనగర్ తదితర ప్రాంతాల్లో వీధి కుక్కల జోరు ఎక్కువగా ఉంది. వేళాపాళా లేకుండా పదుల సంఖ్యలో కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో రోడ్డుపై పాదచారులు, వాహనదారులు భయపడుతున్నారు. ఇక పాఠశాలలకు వెళ్లే చిన్నారులు,



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో మూకుమ్మడి సంచరిస్తున్న కుక్కలు



ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద కుక్కల గుంపు

పిల్లలు వీధి కుక్కలను చూసి జడుసుకుంటున్నారు. వాహనాలపై వెళ్లే వారిని సైతం కుక్కలు వెంటపడుతుండడంతో కొంత మంది కిందపడి గాయపడుతున్నారు. దాదాపు ప్రతీ వారం ఇద్దరు నుంచి ముగ్గురు వరకు కుక్కకాటు బాధితులు ఆస్పత్రులనుఆశ్రయిస్తుండడంతో జనం భయకంపితులవుతున్నారు.

లేగదూడలను చంపేస్తున్నాయి

పట్టణ శివారు ద్వారకానగర్ ప్రాంతంలో ఇటీవల జోగా శ్రీనివాసరావు, కొండబాబుకు చెందిన నాలుగు లేగదూడలను కుక్కలు కొరికి చంపాయి. నరసయ్యపేటలోని లక్ష్మీ అనే పాడి రైతుకు చెందిన దూడను హతమార్చాయి. ఇలా వీధి కుక్కల బారినపడి మతిచెందిన లేగదూడలు అన్నవరం శివారు వెంకయ్యగారి పేట, పట్టణ శివారు గాంధీగ్రామం, నరసయ్యపేట ప్రాంతంలోనూ ఉన్నాయి.



చోడవరం ప్రధాన రహదారిలో వాహన చోదకుడిపై ఎగబడుతున్న కుక్కలు

దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తారస్థాయికి చేరిన కుక్కల బెడద తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



పాత బస్టాండ్ సమీపంలోని రోడ్డుపై కుక్కల జోరు

స్వయంభూ గౌరీశ్వరాలయంలో ఉత్సవ రాట



గౌరీశ్వరాలయం వద్ద ఉత్సవ రాట కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రముఖ స్వయంభూ గౌరీశ్వరాలయం కల్యాణ మహా శివరాత్రి ఉత్సవాలకు సంబంధించి శుక్రవారం ఉత్సవ రాట వేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గూనూరు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ పెదబాబు, అర్చకులు కొడమంచిలి చలపతి, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, దేవరపల్లి వెంకట అప్పారావు, మల్లిబాబు, పప్పు శ్రీను, చీపురుపల్లి సూర్యనారాయణ, ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా అడవి రాజులబాబు పండగ



రాజులబాబును దర్శించుకుంటున్న స్పీకర్ సతీమణి పద్మావతి

గొలుగొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అడవి రాజులబాబు పండగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చీడిగుమ్మల, ఎర్రవరం, పోలవరం, కొత్తఎల్లవరం, జి.కొత్తూరు, పాకలపాడు గ్రామాల్లో పండగ జరిగింది. అటవీ ప్రాంతంలోని అడవి రాజులబాబు ఆలయంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు సతీమణి పద్మావతి, టీడీపీ నేత కామిరెడ్డి గోవింద్, పలు గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక విద్యుత్ దీపాలు ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు కామిరెడ్డి గోవింద, భీమిరెడ్డి సత్యనారాయణ, కసిరెడ్డి సత్తిబాబు, కాపా చినబ్బాయి, లెక్కల అప్పలనాయుడు ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కలుసుకున్న 1968-69 బ్యాచ్ విద్యార్థులు

నర్సీపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1968-69 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. బలిఘట్టం పాకలపాటి గురుదేవుల ఆశ్రమంలో 55 ఏళ్ల తర్వాత వారంతా కలుసుకుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వారి గురువు శాస్త్రి మాస్టారు దంపతులను సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన జయంతి సత్యనారాయణ, వి.సింహాచలం, నీలం రాంబాబులను అభినందించారు.

వీరవిల్లి అగ్రహారానికి ఉత్తమ పంచాయతీ అవార్డు



అవార్డు తీసుకుంటున్న సర్పంచ్ కామలక్ష్మి

మాడుగుల రూరల్, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వీరవిల్లి అగ్రహారం గ్రామ పంచాయతీ జాతీయ స్థాయి ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ మేరకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో జరిగిన వేడుకల్లో కేంద్ర పంచాయతీ రాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ పంచాయతీ అవార్డు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని సర్పంచ్ ఎలగాడ కామలక్ష్మి అందుకున్నారు. పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో అన్ని కేటగిరీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు 90 శాతం అమలు చేసిన వీరవిల్లి అగ్రహారం గ్రామాన్ని ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసి జిల్లా పంచాయతీ రాజ్ శాఖ కేంద్రానికి నివేదించింది. ఈ మేరకు కేంద్ర పంచాయతీ రాజ్ శాఖ ఈ పంచాయతీని జాతీయ స్థాయిలలో ఉత్తమ పంచాయతీగా ఎంపిక చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ కామలక్ష్మి మాట్లాడుతూ అవార్డు పొందడం ఆనందంగా ఉందన్నారు. తాము చేసిన ప్రతీ పనిని డాక్యుమెంట్ రూపంలో ప్రభుత్వానికి అప్పటి పంచాయతీ కార్యదర్శి కెజగదీశ్ నివేదించారన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు.

సాంకేతిక సమావేశాలతో మరింత నైపుణ్యం

మాకవరపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): జాతీయ సాంకేతిక సమావేశాల ద్వారా విద్యార్థులకు మరింత నైపుణ్యం వస్తుందని అవంతి ఇంజనీరింగ్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. అవంతి కాలేజీలో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ సాంకేతిక సమావేశాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి సాంకేతిక సమావేశాల వల్ల విద్యార్థులకు కావాల్సినంత విజ్ఞానం సంపాదించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. అలాగే విద్యార్థులకు సమాచార నైపుణ్యం, సృజనాత్మకత, క్లిష్ట పరిస్థితుల్లో నిర్ణయం తీసుకోగలగడం జరుగుతాయని చెప్పారు. ఈ సందర్భంగా పిల్లలను రక్షించే యంత్రం, నిలిపి ఉంచిన వాహనంలో ఇరుక్కున్న పిల్లలను గుర్తించే పరికరం, బహుళ దిశాత్మక లిఫ్ట్, న్యూస్ అగ్రికల్చర్ వంటి సాంకేతిక నమూనాలను ఏర్పాటు చేశారు. అలాగే మరో 54 నమూనాలను మొదటి రోజు ప్రదర్శనలో ఉంచారు. ఈ కార్యక్రమంలో రాయపూర్ డైరెక్టర్ అచార్య ఎస్‌వీ.రమణారావు, అవంతి కాలేజీ జనరల్ సెక్రటరీ ప్రియాంక, అధ్యాపకులు, పలు కోర్సులకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న అవంతి శ్రీనివాసరావు

అర్హులందరికీ జాబ్ కార్డులు: పీడీ

రోలుగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ జాబ్ కార్డులు మంజూరు చేస్తామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ పూర్ణిమదేవి తెలిపారు. పెదపేటలో ఉపాధి పనులు కల్పించాలని కోరుతూ గురువారం గ్రామస్థులు నిరసన తెలపిన నేపథ్యంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఉపాధి పథకం ఏపీవో ఈశ్వరరావు, ఇతర సిబ్బందితో శుక్రవారం గ్రామంలో పర్యటించారు. గిరిజనులతో సమావేశమై విచారణ చేపట్టారు. ఎంత మందికి జాబ్ కార్డులు ఉన్నాయి? ఎంత మంది ఉపాధి పనులకు వెళుతున్నారు? తదితర అంశాలపై ఆరా తీశారు. పెదపేట నుంచి పంచాయతీ కేంద్రం ఎంకేపట్నం వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నామని, గ్రామంలోనే పనులు కల్పించాలని పలువురు గిరిజనులు కోరారు. రెండేళ్లుగా ఉపాధి పని కల్పించక జాబ్ కార్డు రద్దయిందని, వెంటనే పునరుద్ధరించాలని పాంగి రాజులమ్మ పీడీ ఎదుట వాపోయారు. అనంతరం పీడీ మాట్లాడుతూ రద్దయిన జాబ్ కార్డులను పునరుద్ధరించి, గ్రామంలోనే పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

శంకరరావు సేవలు ఆదర్శనీయం

దేవరాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్ ఏఈఈ కర్రి శంకరరావు సేవలు ఆదర్శనీయమని వక్తలు పేర్కొన్నారు. ఉత్తమ ఏఈఈగా అవార్డు పొందిన శంకరరావును శుక్రవారం సాయంత్రం సత్కరించారు. ఈ సందర్భంగా ఏఈఈ శంకరరావు మాట్లాడుతూ వినియోగదారులకు దగ్గరగా ఉండి సమస్యలు పరిష్కరించడంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. అలాగే ఇటీవల బదిలీ అయిన అరుణ్‌కుమార్, సమర్పణరావు, వరదపురెడ్డి వెంకటరావు, రొంగలి నాగేశ్వరరావును సత్కరించారు. సబ్ ఇంజనీర్ ముత్యాలనాయుడు, లైన్ ఇనస్పెక్టర్ శివకుమార్, సీనియర్ అసిస్టెంట్ జె.ముత్యాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం

దేవరాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చురుగ్గా జరుగుతోంది. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నిధులు మంజూరు చేయడంతో అవసరమైన చోట రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నారు. ఈ పనులు చురుకుగా జరుగుతున్నాయి. సర్పంచ్ పెంటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ సమర్థంగా అమలు చేయాలి

రావికమతం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో భాగంగా కోడ్‌ను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీవో కె.వెంకన్నబాబు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 8వ తేదీ వరకూ ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద మంత్రులు, ఎమ్మెల్యేల హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు తొలగించాలని సూచించారు.

దళితవాడలో సమస్యలు పరిష్కరించాలి

చీడికాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వరహాపురం దళితవాడలో సమస్యలను పరిష్కరించాలని అధికారులను దళితులు కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ మెంబరు మరువాడ ఈశ్వరరావు, చీడికాడ ఆర్‌ఐ రామారావు, వీఆర్‌వో మూర్తి తదితరులు దళితవాడను పరిశీలించి సమస్యలను తెలుసుకున్నారు. దళితుల కోసం ప్రత్యేకంగా అంబేడ్కర్ భవనం మంజూరు చేయించాలని కోరారు. అనంతరం ఈశ్వరరావు మాట్లాడుతూ, ఈ సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

శిథిల రహదారులకు మరమ్మతు పనులు

ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ నయిముల్లా



కొత్తకోటలో వంతెనను పరిశీలిస్తున్న నయిముల్లా

రోలుగుంట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): శిథిలమైన రహదారులను పూర్తి స్థాయిలో మరమ్మతు పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్టు రహదారులు, భవనాల శాఖ చీఫ్ ఇంజనీరింగ్ నయిముల్లా తెలిపారు. వెలంకాయలపాలెం నుంచి చోడవరం వరకు మరమ్మతుకు గురైన ఆర్అండ్‌బీ రహదారిని శుక్రవారం పరిశీలించారు. రోలుగుంట నుంచి వడ్డాది వరకు రోడ్డు పునర్నిర్మాణానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాజుతో కలిసి పరిశీలించారు. రోలుగుంటలో పూర్తిగా శిథిలమైన రోడ్డును, ప్రజలు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని ఇంజనీరింగ్ చీఫ్ దృష్టికి రాజు తీసుకువచ్చారు. గత ఐదేళ్లల్లో ఈ రోడ్డుపై అనేక మంది ప్రయాణించి గాయపడ్డారని వివరించారు. త్వరలోనే ఈ రహదారి నిర్మాణ పనులు ప్రారంభించి పూర్తిచేస్తామని నయిముల్లా హామీ ఇచ్చారు. అనంతరం కొత్తకోటలో శిథిలావస్థకు చేరిన వంతెనలను పరిశీలించారు.

'పెదనందిపల్లి చెరువు వేలం సొమ్ము స్వాహా'



వేలం సొమ్ము స్వాహా చేసిన చెరువును చూపుతున్న రామలింగస్వామి, తదితరులు

దేవరాపల్లి, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదనందిపల్లిలో ప్రభుత్వ చెరువుల్లో చేపల విక్రయానికి బహిరంగ వేలం నిర్వహించి లక్షలాది రూపాయలు స్వాహా చేశారంటూ పెదనందిపల్లి సర్పంచ్ సోమిరెడ్డి సన్నిబాబుపై అదే గ్రామానికి చెందిన ఎంపీటీసీ మాజీ సభ్యుడు కోరుప్రోలు రామలింగ స్వామితో పాటు మరి కొంత మంది ఆరోపించారు. అతని అవినీతిపై ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. తమ గ్రామానికి చెందిన కోనేరు, భామసాగరం, లక్ష్మీసాగరం, కంసాల బంద, నేరళ్ల చెరువు, బొంతు వాని బంద, చేపల పెంపకంతో పాటు వాటి విక్రయానికి 2022లో సర్పంచ్ నిర్వహించిన వేలం పాట లక్షకు పైగా సొమ్ము వచ్చిందన్నారు. అప్పటి నుంచి చెరువులపై వచ్చిన ఆదాయం ఐదు లక్షల రూపాయల వరకు ఉంటుందన్నారు. ప్రభుత్వ చెరువును అనధికారికంగా వేలం వేయడమే కాకుండా ఆదాయాన్ని స్వాహా చేసిన సర్పంచ్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలి ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు.

ఈ విషయమై సర్పంచ్ సన్నిబాబును వివరణ కోరగా తనపై వచ్చిన ఆరోపణలు నిరాధారమైనవని ఖండించారు. రాజకీయ దురుద్దేశ్యంతో బురద జల్లుతున్నారని ఆరోపించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో విగ్రహాలకు ముసుగులు



విగ్రహాలకు ముసుగులు వేస్తున్న దృశ్యం

మాడుగుల, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్‌లను తొలగించే కార్యక్రమానికి ఎంపీడీవో కొంకి అప్పారావు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మండలంలోని 29 పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. రాజకీయ నాయకులు, పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలు తొలగించడంతో పాటు రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలని ఆదేశించారు. దీంతో మండల వ్యాప్తంగా ఉన్న రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేసే పనిలో కార్యదర్శులు పడ్డారు. ఎక్కడ ఏ రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు ఉండకూడదని ఎంపీడీవో ఆదేశాల మేరకు అన్నీ తొలగిస్తున్నామని ఈ సందర్భంగా పలువురు కార్యదర్శులు తెలిపారు.

బైక్ తగలబెట్టుకున్న యువకుడు

నర్సీపట్నం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పెదబొడ్డేపల్లికి చెందిన విజయ్ తన బైక్ తనే తగలబెట్టుకున్నాడు. శుక్రవారం నర్సీపట్నం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో విజయ్‌కి అతని స్నేహితుడుకి మధ్య చిన్న గొడవ జరిగింది. విజయ్ బైక్ తాళాలు అతని స్నేహితుడు పట్టుకుపోయాడు. ఆ కోపంలో తన బైక్‌కి తనే నిప్పు పెట్టాడు. స్థానికులు అగ్ని మాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో మంటలు అదుపు చేశారు.

వాసవీమాత ఆలయంలో అర్పణ దినోత్సవం

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక వాసవీమాత ఆలయంలో శుక్రవారం ఆత్మ అర్పణ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 102 పాల కుండలతో అభిషేకం నిర్వహించారు. అలాగే 102 జ్యోతులతో శ్రీచక్ర పూజలు, ఊంజలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో అర్చక బృందం మంగళంపల్లి శ్రీకాంత్‌శర్మ, డి.సుబ్రహ్మణ్యం, వాసవీ ఆలయ కమిటీ చైర్మన్ కలగర్ల శేషు, భక్తులు పాల్గొన్నారు.

మాడుగులలో...

మాడుగుల: మండల కేంద్రంలో వాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయంలో ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నగర సంకీర్తన, అమ్మవారికి కుంకుమ పూజలు, పల్లకీ ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ పుట్టా మురళీకృష్ణ, మండల మహాసభ అధ్యక్షులు కొట్యాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫస్ట్ ఇంటర్ విద్యార్థులకు క్వాలిఫయింగ్ పరీక్షలు

రావికమతం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తప్పనిసరిగా క్వాలిఫయింగ్ పరీక్షలలో పాల్గొనాలని కొత్తకోట జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.సత్యవతి తెలిపారు. ఫిబ్రవరి 1న నైతిక మానవీయ విలువలు, 3న పర్యావరణ విద్య అనే అంశాలపై పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు.

ఆపన్నులకు ప్రవాసాంధ్రుల సాయం అభినందనీయం

నాతవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి ప్రవాసాంధ్రులు శెట్టి సతీశ్, పారుపల్లి కిరణ్, పైల వెంకటరమణ సాయం అందించడం అభినందనీయమని మాజీ ఎంపీపీ పారుపల్లి కొండబాబు పేర్కొన్నారు. గునుపూడిలో అగ్ని ప్రమాద బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానిక నేత కొండ్రు మరిడియ్య ప్రవాసాంధ్రులను కోరగా, వారు సానుకూలంగా స్పందించి నగదు, నిత్యావసర సరకులు ఇచ్చారని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజయ్‌కుమార్ మాజీ సర్పంచ్ గున్నబ్బాయి మాస్టారు, టీడీపీ నాయకులు సాయి, నానాజీ దేముడు తదితరులు పాల్గొన్నారు.

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి: ఎంపీడీవో

రావికమతం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): నిరక్షరాస్యులను డ్వాక్రా సభ్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీవో వెంకన్నబాబు సూచించారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన వయోజన విద్య వలంటీర్ల ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలలో నిరక్షరాస్యులైన వారిని గుర్తించి ఏడాది కాలంలో అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని కోరారు. అలాగే సైబర్ నేరాలకు గురికాకుండా అవరమైన జాగ్రత్తలు సూచించాలని చెప్పారు. అనంతరం వయోజన విద్య పుస్తకాలను వలంటీర్లకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం ఈశ్వరావు పాల్గొన్నారు.

నష్టపరిహారం చెల్లించరూ..

చీడికాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా వరహాపురం-చీడికాడ రోడ్డులో ప్రమాదానికి గురయ్యానని వరహాపురం గ్రామ టీడీపీ నాయకుడు మిస్కా రామరాజుయాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా కంకర వేయడంతో పాటు కనీసం హెచ్చరిక బోర్డు పెట్టకపోవడంతో ప్రమాదానికి గురయ్యారని, తనకు పరిహారం చెల్లించాలని కోరారు.

అదిరిన అరకు ఉత్సవ్


పద్మాపురం గార్డెన్స్‌లో పుష్పాలతో ఏర్పాటు చేసిన సీతాకోకచిలుక


హాట్ ఎయిర్ బెలూన్ వద్ద విద్యార్థుల సందడి


హెలికాప్టర్ ఎక్కుతున్న పర్యాటకులు


అరకులోయ పట్టణంలో కళాబృందాల సందడి


కార్నివాల్‌లో నృత్యాలు చేస్తున్న అధికారులు


5కే రన్ విజేతలతో కలెక్టర్ దినేశ్‌కుమార్, ఇతర అధికారులు


కూరగాయలతో అందంగా అలంకరణ




పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో

15,006 కిలోల గంజాయి దహనం

» ఫార్మాసిటీ సీడబ్ల్యుఎంపీలో శాస్త్రయ పద్ధతిలో కాల్చివేత


గంజాయి దహనం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ అధికారులు

పరవాడ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ఫార్మాసిటీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు(సీడబ్ల్యుఎంపీ)లో గల ఇన్సినరేషన్ ప్లాంటులో శుక్రవారం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కమిషనర్ నిశాంత్‌కుమార్ నేతృత్వంలో 15,006 కిలోల గంజాయిని దహనం చేశారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ పోలీసులు 2022 నవంబర్ నుంచి 2024 అక్టోబరు 31వ తేదీ వరకు వేర్వేరు ప్రాంతాల్లో సుమారు 15 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనిని శాస్త్రీయ పద్ధతిలో దహనం చేయాలన్న న్యాయస్థానం ఆదేశాల మేరకు ఫార్మాసిటీలోని కోస్టల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టు(సీడబ్ల్యుఎంపీ)లో శుక్రవారం ఈ ప్రక్రియచేపట్టారు. గంజాయి మొత్తం రెండు రోజుల్లో దహనం అవుతుందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ, ఆ శాఖ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ ఎన్.సుజిత్‌సింగ్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పార్టీ పటిష్ఠానికి కృషి చేయాలి

» వైసీపీ శ్రేణులకు మాజీ మంత్రులు బొత్స, అంబటి పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ

కశింకోట, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పటిష్ఠతకు పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని మాజీ మంత్రులు అంబటి రాంబాబు, బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇక్కడ ఒక ప్రైవేటు భవనంలో జరిగిన అనకాపల్లి పార్లమెంటు స్థాయి సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. సామాన్య ప్రజలు తమ సమస్యలపై ఎప్పుడు ఫోన్‌చేసినా కచ్చితంగా స్పందించాలని పార్టీ నాయకులకు హితబోధ చేశారు. నిరంతరం ప్రజల మధ్య వుండి వారి సమస్యలు తెలుసుకుంటేనే గుర్తింపు వుంటుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అయినప్పటికీ సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఫిబ్రవరి నుంచి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పర్యటిస్తారని చెప్పారు. అనకాపల్లి జిల్లా ఇన్‌చార్జి బూడి ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అనకాపల్లి పార్లమెంటు పార్టీ ఇన్‌చార్జి కరణం ధర్మశ్రీ, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే అదీప్‌రాజ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కరక రంగురాళ్ల తవ్వకాలకు స్కెచ్

» అటవీ అనుమతులు లేకుండా రిజర్వ్ ఫారెస్టులోకి ప్రవేశం
» మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, సిబ్బందిని అదుపులోకి తీసుకున్న అటవీ శాఖ సిబ్బంది
» విచారణ చేసి స్టేట్‌మెంట్లు రికార్డు చేసిన రేంజర్
» నేడు విచారణకు హాజరుకావాలని ఆదేశాలు

నర్సీపట్నం/గొలుగొండ, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): కరక రంగురాళ్ల క్వారీ తవ్వకాలకు పెద్ద ఎత్తున స్కెచ్ సిద్ధం చేసుకుంటున్నారు. ఏకంగా మైనింగ్ అధికారులను రంగంలోకి దింపారు. అటవీ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా కరక కొండపై సర్వే చేయడానికి మైనింగ్ అధికారులు వెళ్లి అడ్డంగా దొరికి పోయారు. శుక్రవారం సాయంత్రం కరక రంగురాళ్ల క్వారీలోకి ప్రవేశిస్తున్న మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్, సహాయ సిబ్బందిని అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మీనర్సు అందించిన వివరాలు ఇలా ఉన్నారు.

మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ గొట్టాపు సత్యమూర్తి, సహాయ సిబ్బంది, శాలిక మల్లవరంకి చెందిన ఇద్దరు వ్యక్తులు కరక కొండ పైకి ఎక్కుతుండగా బేస్ క్యాంప్ సిబ్బంది అడ్డుకున్నారు. ఈ విషయాన్ని నర్సీపట్నం రేంజర్ లక్ష్మీనర్సుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. కరక కొండ ఎక్కడానికి ప్రయత్నిస్తున్న వారిని నర్సీపట్నం రేంజ్ కార్యాలయానికి తీసుకురావాలని ఆయన సూచించారు.

రేంజ్ ఆఫీసులో విచారణ

మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్‌తో పాటు సహాయ సిబ్బందిని రేంజర్ లక్ష్మీనర్సు రేంజ్ ఆఫీసులో విచారణ చేశారు. రిజర్వ్ ఫారెస్టులోకి ఎందుకు వచ్చారు? డీఎఫ్‌వో అనుమతి ఉందా? అని ప్రశ్నించారు. మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి మాట్లాడుతూ మైనింగ్ ఏడీ పంపితే సర్వే చేయడానికి వచ్చామని సమాధానం చెప్పారు. కరక రంగురాళ్ల క్వారీ తవ్వకాలకు దరఖాస్తులు వచ్చాయని, సర్వే చేపట్టాలని ఏడీ పంపారని చెప్పారు. అటవీ శాఖ ఉన్నతాధికారుల అనుమతి లేకుండా రిజర్వ్ ఫారెస్టులోకి ఎలా ప్రవేశిస్తారని రేంజర్ నిలదీశారు. వారి నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసి శనివారం ఉదయం 10 గంటలకు విచారణకు రావాలని ఆదేశించారు. అదుపులోకి తీసుకున్న వారిలో మైనింగ్ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి, మైనింగ్ జూవలజీ విభాగానికి చెందిన పోతి శివకుమార్, కూర్మదాసు అప్పలనాయుడు, వి.వీరనాగేశ్వరరావు, జి.రామచంద్రరావుతో పాటు సాలికమల్లవరంకి చెందిన కె.కొండలరావు, అల్లు నూకరాజు ఉన్నారని రేంజర్ లక్ష్మీనర్సు తెలిపారు.

వెటరన్ క్రీడాకారిణి లక్ష్మికి కాంస్య పతకం


ముత్యం లక్ష్మి

చోడవరం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన పరుగుల బామ్మగా పేరొందిన వెటరన్ క్రీడాకారిణి ముత్యం లక్ష్మి కేరళలో శుక్రవారం నిర్వహించిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో షాటపుట్‌లో తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. 85 సంవత్సరాల ముత్యం లక్ష్మికి ఇప్పటికే ఎన్నోసార్లు జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పరుగులో, నడకలో, షాట్‌పుట్ పోటీల్లో అనేకసార్లు పతకాలు సాధించారు. ప్రస్తుత పోటీల్లో షాట్‌పుట్‌లో కాంస్యపతకం సాధించడం పట్ల స్థానిక క్రీడాభిమానులు ఆమెను అభినందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

మాకవరపాలెం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చన్నపాలెంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. లచ్చన్నపాలెం గ్రామానికి చెందిన రొంగల సతీష్(25) బైకుపై ఇంటి నుంచి గ్రామంలో వేరొక చోటకు వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో బైకును తప్పించబోయి పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టాడు. దీంతో తలకు బలమైన గాయం తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గ్రామంలో గౌరీపరమేశ్వర పండగ జరుగుతున్న సందర్భంగా ఈ ఘటన జరగడంతో విషాదఛాయలు చోటుచేసుకున్నాయి. సతీష్ ఆర్‌టీసీలో ప్రైవేటు బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ దామోదరనాయుడు తెలిపారు.

కల్యాణ మండపం పనులు చేస్తూ పైనుంచి జారిపడి వ్యక్తి మృతి

నాతవరం, జనవరి 31(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న కల్యాణమండపం పనులు చేస్తూ పైనుంచి జారిపడి ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడని ఎస్‌ఐ సీహెచ్. భీమరాజు తెలిపారు. తాండవ-నాతవరం రూట్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఓ కల్యాణమండపం పనులకు ఉత్తరప్రదేశ్ నుంచి కొందరు కార్మికులు వచ్చారు. గురువారం సాయంకాలం ఈ కల్యాణమండపం పైభాగంలో పెయింటింగ్ పనులు చేస్తూ ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాధావ్‌రామ్ మౌర్య (41) ప్రమాదవశాత్తు జారిపడ్డాడు. వెంటనే మౌర్యను స్థానిక ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించగా అక్కడ మృతిచెందాడు. కల్యాణ మండపం నిర్మిస్తున్న నిర్వాహకులపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ సీహెచ్ భీమరాజు తెలిపారు.

చలి, మంచును లెక్కచేయకుండా..

» అధిస్థాన్ కంపెనీ ఎదుట మహిళా ఉద్యోగులు రాత్రంతా ఆందోళన

అచ్యుతాపురం, జనవరి 31 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక ఆర్థిక మండలి(ఎస్‌ఈజడ్)లోని అధిస్థాన్ సమీకృత పారిశ్రామిక పార్కు (గతంలో బ్రాండిక్స్) ఉద్యోగుల ఆందోళనతో యాజమాన్యం దిగొచ్చింది. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వ అధికారులు, యాజమాన్య ప్రతినిధులు.. సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరించడానికి ఫిబ్రవరి పదో తేదీ వరకు గడువు కోరడంతో, సీఐటీయూ నాయకులు సమ్మతించారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచి కంపెనీ మెయిన్ గేటు వద్ద చేస్తున్న ఆందోళనను ఉద్యోగులు విరమించారు.

అధిస్థాన్ సమీకృత పారిశ్రామిక పార్కులో సుమారు పది వేల మంది మహిళలు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. రోజుకు ఎనిమిది గంటలు పనిచేయాలి. మధ్యలో అరగంట భోజన విరామం. అయితే ఫిబ్రవరి ఒకటి నుంచి పని వేళలను అర గంట పెంచారు. ఇందుకుగాను నెలకు రూ.700 అదనంగా ఇస్తామని యాజమాన్యం ప్రకటించింది. అయితే ఇంతవరకు ఇస్తున్న ప్రోత్సాకాలను నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. ఉద్యోగి పిల్లలకు ఒకటి నుంచి పదో తరగతి వరకు ఏటా స్కూల్ బ్యాగ్, పుస్తకాలు, క్యారేజీ బాక్స్ ఇచ్చేవారు. ఇంటర్ చదివే వారికి రూ.2 వేలు, డిగ్రీ చదివేవారికి రూ.3 వేలు ఉపకార వేతనంగా ఇచ్చేవారు. వీటిని ఈ సంవత్సరం నుంచి ఇచ్చేది లేదని యాజమాన్యం ప్రకటించింది. ఇందుకు బదులుగా ఉద్యోగికి ఎంతమంది పిల్లలున్నా సంవత్సరానికి రూ.1,800 మాత్రమే ఇస్తామని చెప్పింది. ఇందుకు అంగీకరించే వారంతా కాగితాల మీద సంతకాలు చేయాలని చెప్పింది. గురువారం మొదటి షిఫ్టుకు వెళ్లిన వారిలో కొద్దిమంది సంతకాలు చేశారు. ఈ విషయం రెండో షిఫ్టుకి వచ్చిన వారికి తెలియడంతో వారు విధులకు వెళ్లకుండా కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద బైఠాయించారు. మొదటి షిఫ్ట్ విధులు ముగించుకొని బయటకు వచ్చిన ఉద్యోగులు వీరితో కలిసి ఆందోళనకు దిగారు. సుమారు మూడు వేల మంది మహిళా ఉద్యోగులు చలి, మంచును లెక్కచేయకుండా రాత్రంతా అక్కడే వున్నారు. విషయం అధికారుల దృష్టికి రావడంతో స్పందించారు. లేబర్ కమిషనర్ రమ్య, ఆర్డీఓ ఆయీషా, తహసీల్దార్ జనార్దన్, యాజమాన్య ప్రతినిధులు శుక్రవారం ఉదయం సీఐటీయూ నాయకులు జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, రొంగలి రాము, గనిశెట్టి సత్యనారాయణలతో చర్చలు జరిపారు. సమస్యలు పరిష్కరించడానికి ఫిబ్రవరి పదో తేదీ వరకు గడువు కోరడంతో, సీఐటీయూ నాయకులు సమ్మతించారు. దీంతో ఉద్యోగులు ఆందోళనను విరమించారు.

వేమగిరిలో గ్రావెల్ దందా

... 3వ పేజీ తరువాయి

దరఖాస్తు చేసుకున్నారు. దీంతో జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు ఒక ఎక్స్‌కవేటర్ సాయంతో భూమి చదును చేసుకుని, అవసరం లేని గ్రావెల్‌ను ట్రాక్టర్లతో మాత్రమే తరలించాలని తహసీల్దారు షరతు విధిస్తూ అనుమతులు ఇచ్చారు. కానీ సదరు నాయకుడు ఈ నిబంధనలను ఉల్లంఘించారు. ట్రాక్టర్లతోపాటు మరో ఏడు లారీలను ఏర్పాటు చేసుకుని గ్రావెల్ తవ్వి, పేటసూదిపురంలో రోడ్డు పనులతోపాటు ప్రైవేటు అవసరాలకు తరలిస్తున్నారు. దీనిపై స్థానికులు 'ఆంధ్రజ్యోతి'కి సమాచారం ఇచ్చారు. భూమి చదను పేరిట గ్రావెల్ అక్రమ అమ్మకాలపై తహసీల్దార్ రమేశ్‌బాబుకు 'ఆంధ్రజ్యోతి' ఫోన్ చేసి వివరణ కోరగా.. జిరాయితీ భూమిని చదును చేసుకునే క్రమంలో వచ్చే అదనపు గ్రావెల్‌ను పేటసూదిపురం రోడ్ల నిర్మాణానికి మాత్రమే తరలించుకోవడానికి అనుమతులు ఇచ్చానని చెప్పారు. శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని, నిబంధనలను ఉల్లంఘించినట్టయితే అనుమతులు రద్దు చేస్తానని తెలిపారు.

పడుతూ.. లేస్తూ..

... 3వ పేజీ తరువాయి

యార్డులో చెరకు బండ్లు బారులు తీరాయి. ఈ స్థలం నిండిపోవడంతో మెయిన్ రోడ్డుపక్కన నిలుపుదల చేయాల్సి వస్తున్నది. పొలాల్లో చెరకు నరికిన తరువాత 24 గంటల్లోగా ఫ్యాక్టరీకి తరలించి క్రషింగ్ జరిపితేనే పంచదార దిగుబడి బాగుంటుంది. ఆలస్యం అయ్యే కొద్ది రస నాణ్యతతోపాటు బరువు కూడా తగ్గిపోతుంది. దీనివల్ల ఇటు రైతులు, అటు ఫ్యాక్టరీ నష్టపోతాయి. ఫ్యాక్టరీలో వివిధ కారణాల వల్ల చెరకు క్రషింగ్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతుండడంతో చెరకు తీసుకువచ్చిన రైతులు యార్డులో 24 గంటల నుంచి 48 గంటల వరకు వేచి ఉండాల్సి వస్తున్నది. చలితీవ్రత అధికంగా వుండడం, అర్ధరాత్రి తరువాత నుంచి మంచు దట్టంగా కురుస్తుండడంతో చెరకు బండ్ల వద్ద రైతులు జాగారం చేస్తున్నారు. క్రషింగ్ అస్తవ్యస్తంగా మారిందంటూ ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

షుగర్ ఫ్యాక్టరీ నిర్వహణకు అవసరమైన ఆర్థిక వనరులు లేకపోవడంతో ఆ ప్రభావం పరోక్షంగా చెరకు క్రషింగ్‌పై పడుతున్నది. ఏటా ఏప్రిల్‌లో క్రషింగ్ ముగిసిన అనంతరం నెల రోజులపాటు విరామం ఇచ్చి, ఓవర్ హాలింగ్ పనుల కోసం కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకునేవారు. అయితే ఈసారి సెప్టెంబరు చివరి వరకు కార్మికులను విధుల్లోకి తీసుకోకపోవడంతో ఓవర్‌హాలింగ్ పనులు బాగా ఆలస్యం అయ్యాయి. వీటి ప్రభావం వల్ల చెరకు క్రషింగ్ ఆలస్యంగా మొదలు కావడంతోపాటు తరచూ అంతరాయం కలుగుతున్నది. ఇక నుంచైనా క్రషింగ్ సాఫీగా జరిగి లక్ష్యం మేరకు లక్షన్నర టన్నుల చెరకు గానుగాడితే ఫ్యాక్టరీ భవిష్యత్తుకు ఢోకా వుండదు. లేదంటే ప్రభుత్వం ఆదుకోవాలనుకున్నా ప్రయోజనం ఉండదని రైతులు, కార్మికులు అభిప్రాయపడుతున్నారు.

ఇసుక తవ్వకాలకు వేలం పాట

... 3వ పేజీ తరువాయి

ఎడ్ల బండ్ల ద్వారా ఇసుక తీసుకెళ్లవచ్చని గత ఏడాది నవంబరులో ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. దీనిని టీడీపీ, వైసీపీ నాయకులు తమకు అనుకూలంగా మార్చుకున్నారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఈ ఏడాది జనవరి వరకు పందూరు, గొట్టివాడల వద్ద ఇసుక తవ్వకాల కోసం గత నవంబరులో అనధికారికంగా వేలం పాటలు నిర్వహించారు. పందూరు రీచ్ రూ.17.2 లక్షలు, గొట్టివాడ రీచ్ రూ.5 లక్షలకు పాడుకున్నారు. ట్రాక్టర్ ఇసుక రూ.500 చొప్పున వసూలు చేశారు. ట్రాక్టర్‌లోకి ఇసుక లోడింగ్, రవాణా చార్జీలు దీనికి అదనం. ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చినా పట్టించుకోలేదు.

ఇదిలావుండగా గొట్టివాడ రీచ్‌లో ఇసుక అనధికార తవ్వకాలకు టీడీపీ, వైసీపీ నాయకులు కలిసి గురువారం గ్రామంలో వేలం పాట నిర్వహించారు. ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ వరకు ఇసుక తవ్వి, అమ్ముకోవడానికి ఓ మహిళ ఏకంగా రూ.19 లక్షలకు పాడుకున్నారు. శనివారం నుంచి ఇసుక రవాణా చేసే వాహనాల రాకపోకల కోసం ఎక్స్‌కవేటర్‌తో దారి ఏర్పాటు చేశారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ తిరుమలబాబు అక్కడకు వెళ్లి, దారి ఏర్పాటు పనులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడొకరు తహసీల్దార్‌తో వాదనకు దిగినట్టు తెలిసింది. అయినా సరే తహసీల్దారు వెనక్కు తగ్గకుండా ఎక్స్‌కవేటర్‌ను సీజ్ చేసి కార్యాలయానికి తరలించారు.

ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ పెంపు

... 3వ పేజీ తరువాయి

రిజిస్ట్రేషన్ జరిగాయి. ప్రతి కార్యాలయంలో రోజూ 20-30 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అవుతుంటాయి. ఆస్తుల రిజిస్ట్రేషన్ విలువ పెరగనున్న నేపథ్యంలో గత రెండు రోజుల్లో 40 నుంచి 60 వరకు డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయి. అనకాపల్లి, సబ్బవరం, లంకెలపాలెం, నక్కపల్లి, ఎలమంచిలి, చోడవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు గత రెండు రోజులు ఆస్తుల క్రయవిక్రయదారులతో కిటకిటలాడుతున్నాయి. అనకాపల్లి, సబ్బవరం, నక్కపల్లి, ఎలమంచిలి కార్యాలయాల్లో శుక్రవారం అధిక సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు జరిగాయి. కాగా శుక్రవారం ఒక్క రోజే రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ ద్వారా ప్రభుత్వానికి రూ.1.9 కోట్ల ఆదాయం వచ్చింది.

మొరాయిస్తున్న సర్వర్

అధిక సంఖ్యలో భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సర్వర్లు మొరాయిస్తున్నాయి. దీంతో వివిధ పనుల కోసం గంటల తరబడి వేచివుండాల్సిన పరిస్థితి నెలకొంది. అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు సర్వర్ మొరాయించడంతో రిజిస్ట్రేషన్‌ల ప్రక్రియ నిలిచిపోయింది. సాయంత్రం నుంచి సర్వర్ పనిచేయడంతో అప్పటికే టోకెన్లు జారీ చేసిన వారికి రాత్రి తొమ్మిది గంటల వరకు రిజిస్ట్రేషన్‌లు కొనసాగించారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	95.00
లైవ్ ధర	115.00
విత్ స్కిన్	200.00
స్కిన్ లెస్	210.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509